Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 22.09.2017, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 16 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com



## రాజధానికి...
# రాజమౌళి సెట్టింగా?

- ఆర్కిటెక్ట్‌లు ఆత్మహత్యలు చేసుకోవాలేమో?
- జక్కన్నకు ప్రత్యేక విమానం... విస్తుపోతున్న జనం
- బాబు అజ్ఞానమా? సినీ పరిజ్ఞానమా?

*ఇది నవ్వాలో ఏడవాలో తెలియని పరిస్థితి. అది అజ్ఞానమో విజ్ఞానమో అర్థం కాని దుస్థితి. ఆయనను మేధావి అనుకోవాలా? లేక మేధాశక్తి ముదిరిపోయి ఈ విధంగా వ్యవహరిస్తున్నాడనుకోవాలా? ఈ స్థితిని చూసి సామాన్య ప్రజలు కూడా నవ్వుకుంటున్నారు. బిటెక్‌లు, ఎంటెక్‌లు, ఆర్కిటెక్చర్‌లు చేసిన ఇంజనీర్లయితే నీళ్లు లేని బావుల్లో దూకి ఆత్మహత్యలు చేసుకోవాలనుకుంటున్నారు.*

సినిమాలో పరిపాలన సబ్జెక్ట్ వుంటే పర్లేదు. అసలు పరిపాలనే సినిమా అయితే... ఇదిగో ఇప్పుడు రాష్ట్రంలో పరిపాలన కూడా సినిమాలాగే తగలబడింది. తెలుగు రాష్ట్రాలలోనే కాదు, దేశం నిండా అపార మేధాశక్తిగల ఇంజనీర్లున్నారు. దేశ విదేశాలలో అత్యద్భుత నిర్మాణాలు చేపడుతున్న స్వదేశీ ఇంజనీరింగ్ కంపెనీలున్నాయి. పోనీ స్వదేశీ కంపెనీలు నచ్చలేదంటే అంతర్జాతీయ స్థాయి నిర్మాణ సంస్థలున్నాయి. ఇన్నింటిని వదిలేసి సినిమాలకు సెట్టింగ్‌లు వేసుకునే ఓ సినీ దర్శకుడిని అమరావతి రాజధానిలో అసెంబ్లీ, హైకోర్టు భవనాలకు డిజైన్‌లు చేసివ్వమని కోరడమేమిటి. ఇది ఏం దౌర్భాగ్యం. ఆ సెట్టింగ్‌లు వేసేది కూడా ఆ దర్శకుడు కాదు. ఆర్ట్ డైరెక్టర్‌లు. సినీ సెట్టింగ్‌లన్నవి శాశ్వతం కాదు. ఎప్పటికప్పుడు ఊడదీసుకుని పోతుండొచ్చు. మరి శాశ్వతంగా నిర్మించుకోవాల్సిన భవనాలకు సెట్టింగ్‌లు వేసుకునే వాళ్ళు డిజైన్‌లు ఇవ్వాలా? ఇదేనా మనం ప్రపంచ దేశాలకు నేర్పిన పాఠం.

అమరావతిలో అసెంబ్లీ, హైకోర్టు భవనాల నిర్మాణానికి సలహాలు ఇవ్వాలంటూ మంత్రి నారాయణ వెళ్ళి సినీ దర్శకుడు రాజమౌళిని కోరడం, అమరావతిలో అసెంబ్లీ కట్టాలనుకుంటున్న ప్రాంతాన్ని రాజమౌళి పరిశీలించడం... అంతా ఒక చిత్రంగా వుంది. మంత్రుల

(మిగతా 11వ పేజీలో)



# శెభాష్ ఆర్.కె!

- ఇది వైకాపా విజయం
- సదావర్తి భూములపై నెగ్గిన పంతం
- ఇంకా డ్రామాలాడుతున్న ప్రభుత్వం

నాయకుడంటే ప్రజలకు రక్షణగా వుండాలి. ప్రజల ఆస్తులకు కాపలా దారుగా వుండాలి. ప్రజల పక్షాన ఎంత వరకైనా పోరాడాలి. ఇలాంటి పోరాటాలతోనే నాయకులు ప్రజా నాయకులవుతారు. ఈ కోవకు చెందినవాడే మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి. చంద్రబాబు ప్రభుత్వాన్ని ముప్పతిప్పలు పెడుతూ మూడుచెరువుల నీళ్ళు తాగిస్తున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శాసనసభ్యుడు.

చెన్నైలోని సదావర్తి సత్రం భూముల వేలం విషయంలో ఆర్‌కె చేసిన న్యాయ పోరాటం విజయం సాధించింది. ప్రతిపక్ష వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి ఇది పెద్ద మైలేజీని సాధించింది.

చెన్నైలోని సదావర్తి భూములు 89.11 ఎకరాలకు ఈనెల 18వ తేదీన చెన్నైలోని టీటీడీ సమాచార కేంద్రంలో రెండోసారి వేలం నిర్వహించారు. కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన సత్యనారాయణ బిల్డర్స్ అధినేత బద్వేలు శ్రీనివాసులురెడ్డి 60.30 కోట్లకు పాడి ఈ భూములను దక్కించుకున్నారు. ఏడాదిన్నర క్రితం ఇవే భూములకు వేలం పాట నిర్వహించగా అప్పుడు కాపు కార్పొరేషన్ ఛైర్మెన్ చెలమలశెట్టి రామానుజయ

(మిగతా 11వ పేజీలో)

## కరివేపాకులా...
# పవర్‌స్టార్?

- వాడుకుని వదిలేసిన మోడీ...



రాజకీయాలలో కొందరి పరిస్థితి కూరలో కరివేపాకు మాదిరిగానే వుంటుంది. అవసరం వున్నప్పుడు వాడుకోవడం, అవసరం తీరాక దూరంగా పడేయడం. పవర్‌స్టార్ పవన్‌కళ్యాణ్ పరిస్థితి కూడా అంతే!

2014 ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీకి, రాష్ట్రంలో టీడీపీకి పట్టం కట్టాలంటూ తన అభిమానులకు పిలుపునిచ్చాడు. నరేంద్ర మోడీ, చంద్రబాబులతో కలసి ఒకే వేదికను పంచుకున్నాడు. ఆ ఎన్నికల్లో తన జనసేన పార్టీ తరపున అభ్యర్థులను పెట్టకుండా బీజేపీ, టీడీపీలకు సంపూర్ణ మద్దతు పలికాడు.

అయితే ఎన్నికల తర్వాత కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ, రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టీడీపీ రెండూ కూడా పవన్‌ను కూరలో కరివేపాకు లాగా తీసి పక్కనపడేసాయి. ముఖ్యంగా రాష్ట్రానికి ప్రత్యేకహోదా లేదని కేంద్రం ప్రకటించాక పవన్ కళ్యాణ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసాడు. కేంద్రం తీరుకు నిరసనగా ప్రత్యేక హోదా కోసం

(మిగతా 11వ పేజీలో)



# ఏసిబి వలలో నాయుడుపేట కమిషనర్



నెల్లూరుజిల్లా నాయుడుపేట నగర పంచాయతి కమిషనర్ అవినేని ప్రసాద్ ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నాడని అవినీతి నిరోధకశాఖ అధికారులు మంగళవారం నాయుడుపేట కార్యాలయంలో తనిఖీలు చేపట్టారు. ఏకకాలంలో ఆరు చోట్ల తనిఖీలు చేపట్టారు. కమిషనర్ ఉంటున్న నివాసం, నెల్లూరు చిల్డ్రన్స్ పార్క్, రాంజీనగర్ వద్దగల కమిషనర్ కుమార్తె, బంధువులు, స్నేహితుల ఇళ్ళల్లో దాడులు నిర్వహించారు. నెల్లూరు, ఒంగోలు అవినీతి శాఖ అధికారులు బృందాలుగా ఏర్పడి అందులో ఒక బృందం సభ్యులు నాయుడుపేట నగర పంచాయతి కార్యాలయానికి తెల్లవారుజామున 4 గంటలకే చేరుకున్నారు. ఒంగోలు ఏసిబి ఇన్‌స్పెక్టర్ టివిపి ప్రతాప్‌కుమార్ అధ్యక్షతన అయిదు మంది చేరుకుని మేనేజరు ఉమామహేశ్వరరావును కార్యాలయానికి పిలిపించి రికార్డుల పరిశీలన చేపట్టారు. కమిషనర్ ఛాంబర్‌కు చేరుకుని బీరువాల్లోని అన్ని రికార్డులను పరిశీలించారు. కంప్యూటర్‌లోని వివరాలు తెలుసుకున్నారు. తమకు అవసరమైన సమాచారాన్ని మేనేజరు ఉమామహేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. ఏసిబి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కమిషనర్‌కు దూరపు బంధువు తిరుమలనాయుడును పిలిపించి మాట్లాడారు. చిత్తూరుజిల్లా నగర పురపాలక సంఘం మేనేజర్‌గా పనిచేస్తున్న ప్రసాద్ 2015 జూన్ 30న నాయుడుపేట నగర పంచాయతీకి కమిషనర్‌గా విధుల్లో చేరాడు. ప్రసాద్‌పై ఆదాయానికి మించిన ఆస్తులు కలిగి ఉన్నట్లు వచ్చిన ఫిర్యాదుల మేరకు కేసును నమోదు చేసినట్లు నెల్లూరు అవినీతి నిరోధక శాఖ డిఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. కమిషనర్ ప్రసాద్‌కు సంబంధించి రూ.10కోట్లకు పైగా అక్రమ ఆస్తులను గుర్తించినట్లు డిఎస్పీ వెల్లడించారు. అందులో ప్రసాద్ తల్లి పేరు మీద శ్రీకాళహస్తిలో మూడంతస్తుల భవనం, తిరుపతి ఎన్జీవో కాలనీలో జీప్లస్ 5 రెసిడెన్షియల్ బిల్డింగ్, తిమ్మనాయుడు పాలెంలో ఫ్లాటు, అదే ప్రాంతంలో మరో ఫ్లాటు, తిరుపతి నగరంలో ప్రసాద్ సతీమణి పేరుపై అయిదు ఇళ్ల స్థలాలు, తల్లిపేరు మీద పూడిరోడ్డులో వ్యవసాయ భూమి, తిరుపతి అక్కారంపల్లి పరిధిలో మరో భూమి, గాజులమండ్యంలో మరో భూమి కలిగి ఉన్నట్లు గుర్తించారు. ఈ ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్లో రూ.10కోట్ల వరకు ఉంటుందని అధికారుల అంచనా.

# ఐలయ్యను కఠినంగా శిక్షించాలి



ఆర్యవైశ్యులను కించపరిచేలా పుస్తకం రాసిన కంచె ఐలయ్యను కఠినంగా శిక్షించాలని నెల్లూరు ఫ్యాన్సీ అసోసియేషన్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్, ఆర్యవైశ్య వాసవి మాత ప్యానల్ ఆధ్వర్యంలో బుధవారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ముక్కాల ద్వారకానాథ్ పాల్గొన్నారు. ఈ ర్యాలీ నెల్లూరు పెద్దబజార్ సెంటర్ నుండి చిన్నబజార్, నర్తకి సెంటర్, గాంధీబొమ్మ మీదుగా ఆత్మకూరు బస్టాండ్, స్టోన్‌హౌస్‌పేట మీదుగా సాగింది. ఐలయ్యను దేశం నుండి బహిష్కరించాలంటూ నినాదాలతో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ముక్కాల ద్వారకానాథ్ మాట్లాడుతూ కులాలను కించపరిచేలా ఐలయ్య రాతలు ఉన్నాయని అతనిని ప్రభుత్వం వెంటనే ప్రొఫెసర్ స్థానం నుండి తొలగించి దేశ బహిష్కారం చేయాలన్నారు. లేనిపక్షంలో రాస్తారోకోలు, ధర్నాలను ఉధృతం చేస్తామన్నారు. అనంతరం పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ర్యాలీని ముగించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున, నూకల పుల్లయ్య, బాబు, పబ్బిశెట్టి శ్రీనివాసులు, తిరివీధి ప్రకాశరావు, సత్యకృష్ణ, దశయ్య తదితరులు పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

# పోలీసులపై దాడి అమానుషం

చీటింగ్ కేసులో నిందితుడ్ని అరెస్ట్ చేసేందుకు వెళ్ళిన పోలీసులపై సోమవారం నిందితుడు, అతని కుటుంబసభ్యులు దాడి చేయడం అమానుషమని ఏపి పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు ఖండించారు. దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని పోలీసు అధికారుల సంఘం నాయకులు జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణను కోరారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నెల్లూరుజిల్లా ఆత్మకూరు మండలం బట్టేపాడుకు వెళ్ళిన దుత్తలూరు ఎస్సై ఎం.వెంకటరాజేష్, అతని సిబ్బందిపై నిందితుడు, అతని కుటుంబసభ్యులు దాడి చేయడం గర్హనీయమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసు అధికారులు కఠినంగా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎం.గంగాధర్, సభ్యులు తురకా శ్రీనివాసులు, ప్రసాద్ పాల్గొన్నారు.

# దసరా సెలవులు

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ పాఠశాలలకు 21వ తేదీ నుండి దసరా సెలవులిచ్చేసారు. వచ్చే నెల 3వ తేదీ వరకు విద్యాసంస్థలకు సెలవులుంటాయి. అలాగే జూనియర్ కాలేజీలకు 24వ తేదీ నుండి అక్టోబర్ 3వ తేదీ వరకు సెలవులిచ్చారు. సెలవు రోజుల్లో ఎవరైనా తరగతులు నిర్వహిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఇన్‌ఛార్జ్ డిఇఓ శ్రీనివాసులురెడ్డి హెచ్చరించారు.

# కళకళలాడుతున్న సోమశిల జలాశయం



నెల్లూరుజిల్లాలోని సోమశిల జలాశయం కళకళలాడుతోంది. గత కొన్ని రోజులుగా రాయలసీమ ప్రాంతాలైన కర్నూలు, కడప జిల్లాల్లో కురుస్తున్న వర్షాలకు కుందూనది నుంచి భారీగా వరద నీరు సోమశిల జలాశయం వైపు పరుగులు తీస్తోంది. ఇదేవిధంగా కొనసాగితే ఈ దఫా మరో 5టిఎంసీల వరకు సోమశిలకు వరదనీరు చేరవచ్చని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుత వరదనీటికి కృష్ణానదీ జలాలు కూడా తోడైతే ఈ ఏడాది మొదటి పంటకు ఢోకా ఉండదని ఆయకట్టు రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## విద్యాదాత...

# రాజా సత్యనారాయణ కన్నుమూత



వింజమూరులోని వై.ఆర్ జూనియర్ కళాశాల వ్యవస్థాపకులు, ఆ కాలేజీకి సుదీర్ఘకాలం ప్రిన్సిపాల్‌గా పనిచేసిన విద్యావేత్త రాజా సత్యనారాయణ ఈ నెల 20వ తేదీన వింజమూరులోని తన స్వగృహంలో కనుమూశారు. ఆయన వయసు 82 సంవత్సరాలు.

జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా వుంటూ ఆ ఉద్యోగాన్ని వదులుకుని వింజమూరు బంగ్లాసెంటర్‌లో దాతలు యేల్చూరి రంగనాథం శ్రేష్టి సహకారంతో 1975లో వై.ఆర్ జూనియర్ కాలేజీని స్థాపించారు. ఆ రోజుల్లోనే ఉదయగిరి ప్రాంతంలో ఈ కాలేజీకి ఎంతో గుర్తింపు వచ్చింది. ఈ కళాశాల క్రమశిక్షణకు మారుపేరుగా ఉండేది. విద్యార్థులకు ఎంతో నిబద్ధతతో విద్యాబోధన జరిగేది. రాజా సత్యనారాయణ కరస్పాండెంట్ మరియు ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ... ఈ కళాశాలకు ఎంతో మంచి గుర్తింపు తెచ్చారు. కార్పొరేట్ విద్యాసంస్కృతి రాకముందు ఈ కళాశాలలో సీటు దొరకడమే మహాభాగ్యంగా విద్యార్థులు భావించేవాళ్ళు. ఇక్కడ విద్యాబోధనతో పాటు విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలను పెంపొందించడానికి రాజా సత్యనారాయణ ఎక్కువ ప్రాధాన్యతనిచ్చేవారు. రాజా సత్యనారాయణ మార్గదర్శకంలో ఈరోజు వేలమంది విద్యార్థులు దేశ విదేశాలలో వివిధ హోదాలలో స్థిరపడి వున్నారు. రాజా సత్యనారాయణ మృతితో వై.ఆర్ కళాశాల పూర్వవిద్యార్థులు దిగ్భ్రాంతి చెందారు. రాజా సత్యనారాయణ మృతికి సంతాపం ప్రకటిస్తూ... వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

## మార్గదర్శకుడిని కోల్పోయా!

**- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

రాజా సత్యనారాయణ మరణం తనను ఎంతగానో కలచివేసిందని ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు తన సంతాప ప్రకటనలో పేర్కొన్నారు. 1970వ దశకంలోనే వింజమూరులో వై.ఆర్ జూనియర్ కళాశాలను నెలకొల్పి వింజమూరు, ఉదయగిరి ప్రాంతాలకు చెందిన అనేక మంది పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు చదువుకునే అవకాశం కల్పించారు. ఎంతో మంది విద్యార్థుల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దారు. నేను ఉదయగిరి శాసనసభ్యుడిగా పోటీ చేసి గెలిచిన రెండు సందర్భాల్లోనూ వింజమూరులోని రాజా సత్యనారాయణ ఇల్లే నాకు ఎన్నికల కేంద్రంగా వుండేది. నేను శాసనసభ్యునిగా వున్న కాలంలో కూడా ఆయన నాకు ఎన్నో సూచనలు, సలహాలు ఇచ్చి నాకు మార్గనిర్దేశం చేసేవాళ్ళు. ఆరెస్సెస్ జ్యేష్ఠ కార్యకర్త అయిన ఆయన ఉదయగిరి ప్రాంతంలో సంఘ్ వ్యాప్తికి విశేషకృషి చేసారు. అలాంటి మానవతామూర్తి మరణం నన్ను కలచి వేసింది. మరణ వార్త తెలియగానే ఆయన కుమారుడు రాజా పవన్‌కుమార్‌కు ఫోన్‌చేసి ప్రగాఢ సంతాపాన్ని తెలిపాను. రాజా సత్యనారాయణ ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నానని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

## 29న అభినయ ఆర్ట్స్

# సాంస్కృతిక పోటీలు

నెల్లూరులోని అభినయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు నెల్లూరు టౌన్‌హాలులో వివిధ సాంస్కృతిక పోటీలను నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు సి.ఆర్.రాఘవ తెలిపారు. ఉదయం నుండి సినీ సంగీత, నృత్య, ఏక పాత్రాభినయ పోటీలు జరుగుతాయన్నారు. సాయంత్రం 5గంటల నుండి శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, సినీ సంగీత విభావరి జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అనేక ఉత్తమ బహుమతులు అందుకున్న గుంటూరు, కత్తిపాడు ఉషోదయా కళానికేతన్ వారి "గోవు మాలచ్చిమి" సందేశాత్మక నాటికను ప్రదర్శిస్తారని తెలిపారు. ఇతర వివరాలకు 9440675070 నెంబరులో సంప్రదించాలని కోరారు.

# గూడూరులో వైయస్సార్సీపీ ధర్నా



గూడూరు మున్సిపల్ పరిధిలో ప్రజలు సమస్యలతో సతమతమవుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని వైకాపా సీనియర్ నాయకుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి విమర్శించారు. గూడూరు పట్టణంలోని పురపాలక కార్యాలయం ముందు 4వ వార్డులోని పలు సమస్యలపై వైకాపా గూడూరు పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సమయంలో డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ వాటి బాగుకు చర్యలు శూన్యం అన్నారు. సనత్‌నగర్‌లో తాగునీటి పైపులైన్లు అసంపూర్తిగా వున్నా పట్టించుకోవడం లేదని చెప్పారు. మరుగుదొడ్ల నిర్మాణంలో అవకతవకలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ నాగులు, గిరిబాబు, మగ్దూం, నారాయణరెడ్డి, కాలేషా, మనోహర్, శేషు, బిక్కు సాహెబ్ తదితరులు ఉన్నారు.

# టిఎస్సార్ జన్మదినోత్సవ సంబరం.. పులకించిన విశాఖ తీరం

- తరలివచ్చిన ప్రముఖులు.. వెల్లివిరిసిన ఆధ్మాతిక - కళాకాంతులు
- సినీనటి జమునకు 'నట కళావాణి' బిరుదు ప్రదానం

**'సెప్టెంబర్-17'...విశాఖ ప్రజలకే కాదు, ఆధ్యాత్మిక, సంగీత, సాహిత్య, కళా రంగాల వారందరికీ ఈ తేదీ ఒక ల్యాండ్‌మార్క్. ఇది అందరికీ గుర్తుండి పోయే రోజు. ప్రత్యేకించి దేశవ్యాప్తంగా ఖ్యాతిగన్న ఎంతోమంది కళాకారులకు, సినీరంగ ప్రముఖులకు, పారిశ్రామికవేత్తలకు, ప్రముఖులకు.. సామాజిక సేవారంగాల వారికి బాగా గుర్తున్న రోజు. ఆ రోజున ఎందరో ప్రముఖులకు ఘనసత్కారం జరుగుతుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రతిభకు ఇక్కడ పట్టాభిషేకం జరుగుతుంది. అందుకే ఆ రోజుకు అంత విశిష్టత. ఆ రోజు... మరేదో కాదు. కళాబంధు, రాజ్యసభ సభ్యుడు, అన్ని రంగాలవారికీ అత్యంత ఆత్మీయుడు..సుబ్బరామిరెడ్డి పుట్టినరోజు. టిఎస్సార్ జన్మదిన వేడుకలంటే కళారంగానికి, ఆధ్యాత్మిక రంగానికి పండుగ రోజేనని వేరే చెప్పనక్కర లేదు. అందుకే ఆ రోజున విశాఖపట్నం ఆధ్యాత్మిక-కళాకాంతులతో మెరిసిపోయింది. విశాఖతీరం ఆనందోత్సాహాలతో పులకించిపోయింది. రెండు రోజులపాటు జరిగిన వేడుకల్లో టిఎస్సార్ పేరు మారుమోగిపోయింది. టిఎస్సార్.. అన్నీ తానే అయి నిర్వహించిన ఈ ఆనందసంబరాలు అంబరాన్నంటాయి.**






టిఎస్సార్ పుట్టినరోజు సంబరాలు సెప్టెంబర్ 16-17 తేదీల్లో ఎంతో వైభవంగా, కన్నులపండువగా జరిగాయి. టిఎస్సార్ పుట్టిన రోజు 17వ తేదీ అయినా, ఆ వేడుకను పురస్కరించుకుని ఒక రోజుకు ముందే విశాఖలో పండుగ సంతోషం వెల్లువెత్తింది. ప్రఖ్యాత ఆధ్యాత్మికవేత్తలు, ఎందరో ప్రముఖులు, సినీరంగంలోని ప్రసిద్ధులు ఎంతోమంది విశాఖకు తరలివచ్చారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ వేడుకలు ఎంతో సంతోష సంరంభాల మధ్య జరిగాయి. విశాఖ శ్రీ శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామీజీ శుభాశీస్సులతో ప్రారంభమైన ఈ వేడుకలు ఆద్యంతం భక్తిభావ సమన్వితంగా, కళారాధన సమన్వయంగా సాగాయి. ఈ సందర్భంగా స్వరూపానందేంద్ర స్వామీజీ మాట్లాడుతూ, టిఎస్సార్ అన్ని మతాలను కలుపుకుని సామాజికవేత్తగా, ఆధ్యాత్మికవేత్తగా సేవలందిస్తున్నారని కొనియాడారు. ప్రజల గుండెల్లో దేవుడున్నాడని నమ్మిన వ్యక్తి టిఎస్సార్ అని ప్రశంసించారు. టిఎస్సార్ మాట్లాడుతూ, అందం, ఐశ్వర్యం, అధికారం శాశ్వతం కాదని..ఆధ్యాత్మిక శక్తే శాశ్వతమని అన్నారు. ముక్కామల క్షేత్రం పీఠాధిపతి శ్రీ శ్రీధరస్వామీజీ, రెండురాష్ట్రాల యోగాధ్యయన పరిషత్ ఉపాధ్యక్షులు పండిట్ శేషభట్టర్ సుదర్శనాచార్య, పలు దేవాలయాల ప్రధాన అర్చకులతో పాటు, ముస్లిమ్‌ల ఆధ్యాత్మిక గురువు షేక్ రహ్మాన్‌సాహెబ్, గురుద్వార్ ఆధ్యాత్మికవేత్త సర్దార్ హర్నిక్ సింగ్, ఫాదర్ పరవస్తు తదితరులు పాల్గొన్నారు.



## సాటి మనిషికి సాయమందిస్తా...
## చివరిశ్వాస వరకు సామాజిక సేవ చేస్తా

**- పుట్టినరోజు వేడుకల్లో సుబ్బరామిరెడ్డి**

సాటిమనిషికి వీలైనంత సాయం చేయడంలో ఉన్న ఆనందం ఎంతో గొప్పదని, ఆ ఆనందం అనుభవించేవారికే తెలుస్తుందని, తన చివరిశ్వాసవరకు సామాజిక సేవ చేస్తానని తన పుట్టినరోజు వేడుకల్లో టిఎస్సార్ ఎంతో ఉద్వేగంతో అన్నారు. సాటిమనిషికి చేయందించడంలోనూ, ప్రతిభకు పట్టాభిషేకం చేయడంలోనూ తాను ముందుంటానన్నారు. సినీరంగంలో వెండితెర హీరాలుగా పేరొందిన వారిని బాధ్యతగా తన జన్మదినోత్సవం రోజున తెలుగు ప్రజలు, విశాఖ ప్రజలందరి సమక్షంలో సన్మానిస్తున్నానన్నారు. ఎన్నో మసీదులు, ప్రార్ధనా మందిరాలు, దేవాలయాల నిర్మాణాలకు తనవంతు సహాయాన్ని అందిస్తున్నానన్నారు. ప్రకృతి సౌందర్యం, కళానైపుణ్యం నిండుగా ఉన్న విశాఖలో సినీ స్టూడియో నిర్మాణానికి తనవంతు కృషి చేస్తానని టిఎస్సార్ అందరి హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. విశాఖ ప్రజల కోసం తన ప్రాణం ఉన్నంతవరకు సేవ చెయ్యడానికి వెనుకాడనన్నారు. తన ఉత్సాహానికి ఊపిరి పోస్తున్నది విశాఖేనని ప్రజలందరి కరతాళధ్వనుల మధ్య ఆయన అన్నారు. క్రమశిక్షణ, అంకితభావంలలో తనకు ఏఎన్నార్, ఎన్టీఆర్‌లే స్ఫూర్తి అన్నారు. ఈ సందర్భంగా టిఎస్సార్ ఆ భగవంతుని ప్రార్ధిస్తూ ఆలపించిన ఆధ్యాత్మికగీతాలు, మంత్రోచ్ఛరణలతో వేదిక పులకించిపోయింది. ఆ తర్వాత, టిఎస్సార్ పుట్టినరోజును పురస్కరించుకుని టిఎస్సార్ బంగ్లాలో కేకు కట్‌చేశారు. పేదలకు దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంతోమంది ప్రముఖులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని టిఎస్సార్ సేవలను అభినందించారు.



## 'నట కళావాణి' జమున

అనంతరం, తన పుట్టినరోజైన 17వ తేదీన పోర్టు కళావాణి స్టేడియంలో టి.సుబ్బరామిరెడ్డి లలిత కళాపరిషత్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో, కళాబంధు టిఎస్సార్ తదితర ప్రముఖులందరి సమక్షంలో.. ప్రఖ్యాత నటీమణి, నవరస నటసామ్రాజ్ఞి..శ్రీమతి జమునకు ఎంతో విశిష్టమైన 'నట కళావాణి' బిరుదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శ్రీమతి జమునను టిఎస్సార్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అలనాటి ప్రముఖ సినీతారలు బి.సరోజాదేవి, వాణిశ్రీ, శారద, కాంచన, రాజశ్రీ, గీతాంజలి, నేటి తరం తారలు జయసుధ, జయచిత్ర, జయప్రద, ప్రభ, ప్రముఖ గాయనీమణులు జిక్కి, సుశీల తదితరులందరూ పాల్గొని శ్రీమతి జమునను అభినందించారు. నటనారంగంలో శ్రీమతి జమున అద్వితీయమైన ప్రతిభను ప్రశంసిస్తూ టిఎస్సార్‌తో పాటు మంత్రి గంటా శ్రీనివాసరావు తదితరులు శ్రీమతి జమునకు ఘనసత్కారం అందజేశారు. స్వర్ణకంకణంతో పాటు, వీణ, పలు జ్ఞాపికలను బహుకరించారు. అనంతరం, పుట్టినరోజు వేడుకలను జరుపుకుంటున్న టిఎస్సార్‌ను గజమాలలతో అందరూ ఘనంగా సత్కరించి టిఎస్సార్‌పై తమకున్న ఆత్మీయతను చాటుకున్నారు. మంత్రి గంటా శ్రీనివాసరావు తదితర వక్తలు మాట్లాడుతూ, పార్టీలకు, కులమతాలకు అతీతంగా ఉండే వ్యక్తి కళాబంధు టిఎస్సార్ అని, అందరూ ఆయన్ను చూసి నేర్చుకోవాల్సింది ఎంతైనా ఉందని అన్నారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజల కోసం ఎన్నో కార్యక్రమాలు టిఎస్సార్ నిర్వహిస్తుంటారని, ఏ శుభసందర్భం వచ్చినా ఆధ్యాత్మిక, సాంస్కృతిక సంబరాలను ఎంతో ఉత్సాహవంతంగా నిర్వహించి అందరినీ ఆనందతరంగితుల్ని చేస్తుంటారని వారన్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే కళాబంధు మన సుబ్బరామిరెడ్డి..కారణజన్ముడని వక్తలు కొనియాడారు. ఇలా పలు రంగాల ప్రముఖులందరినీ ఒక వేదికమీదికి తీసుకువచ్చి గౌరవించే ఘనత ఒక్క సుబ్బరామిరెడ్డికే దక్కుతుందని అందరూ ప్రశంసించారు. రాజ్యసభ సభ్యుడు కెవిపి రామచంద్రరావు మాట్లాడుతూ, మానవకళ్యాణం కోసం టిఎస్సార్ చేస్తున్న సేవలు ఎంతో ప్రశంసనీయమైనవని అన్నారు. విశాఖ ప్రజల ఆశీస్సులు ఆయన్ను నిత్య ఉత్సాహవంతునిగా తీర్చిదిద్దుతున్నాయని అభినందించారు. టిఎస్సార్ అజాతశత్రువని, అందరికీ ఆదర్శనీయుడని పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు పరుచూరి బ్రదర్స్, స్వాతి ప్రమోటర్స్ అధినేత మేడపాటి కృష్ణారెడ్డి, ద్రోణంరాజు శ్రీనివాసరావు, వంశీ రామరాజు, బెహరా భాస్కరరావు, టి. గురుమూర్తిరెడ్డి, పేడాడ రమణకుమారి, డి.వరదారెడ్డి, భాషా, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సంగీతదర్శకుడు వాసూరావు ఆధ్వర్యంలో టిఎస్సార్ ఆలపించిన పలు ఆధ్మాత్మిక గీతాలు, మంత్రోచ్ఛరణ అందరినీ ఆకట్టుకున్నాయి.



## 'ప్రభా'తం

# తమిళనాట... పవర్ ఆట

**అధికారం కోసం బలాబలాలు తేల్చుకోవాల్సిన గడువుకు ముందే, ఒక వర్గానికి చెందిన కొందరు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడడం తమిళ రాజకీయాల్లో మరో సంచలనమైంది. రోజుకో రకం రాజకీయాలతో తమిళనాడులో రాజకీయ వాతావరణ అస్తవ్యస్తమైపోతోంది. ఈ రాజకీయ సంక్షోభం త్వరగా సమసిపోయేందుకు, తమిళప్రజల ఆశలు, ఆకాంక్షలకు తగ్గట్లుగా ప్రజాస్వామ్యబద్ధమైన రీతిలో అంతా సవ్యంగా సాగేందుకు కేంద్రంతోపాటు, రాజకీయవిజ్ఞులు తగు చొరవ తీసుకోవాల్సివుంది.**

రాజకీయాల్లో ఎప్పుడు ఏమైనా జరగొచ్చు. ఫలానాది జరుగుతుందని అనుకుంటే అది జరక్కపోవచ్చు. అందరూ ఒకటనుకుంటే, అది జరగొచ్చు.. జరగకపోనూ వచ్చు. నిన్నటిదాకా గిట్టని వారే, తదుపరి క్షణం నుంచి ఆప్తులైపోవచ్చు. వెళ్ళిపోయిన పార్టీనుంచి మళ్ళీ తిరిగొచ్చి తప్పిపోయిన బిడ్డ తల్లి ఒడికి చేరినట్లుగా ఉందని సంబరపడనూ వచ్చు. ఇలాగే ఉంటాయి రాజకీయాలంటే. ఇలాంటి రాజకీయాలు రాజకీయాల్లో సర్వసాధారణం. తమిళనాడులో ఇవింకా జోరుగా ఉండడం అందరికీ తెలిసిందే. అక్కడివి క్షణక్షణ రాజకీయాలు. ఏ క్షణంలో ఏమి జరుగుతుందో, ఏ పార్టీ వారు ఏ పార్టీలోకి వెళ్తారో, ఏ పార్టీ నుంచి ఎవరు విడిపోతారో.. అంతా అనూహ్యం. ప్రస్తుత తమిళనాడు రాజకీయాల కల్లోలం చూస్తుంటే ఎవరికైనా దాదాపు ఇలాగే అనిపిస్తుంది. ప్రజల్లో బలమైన ఆదరణ, పట్టు ఉన్న నాయకుడు కరువైతే ఎంత సంక్షోభం ఎదురవుతుందో, ఆ సంక్షోభమంతా ఇప్పుడు తమిళనాడులో కనిపిస్తోంది. ఇక్కడంతా ఇప్పుడు విచిత్ర పరిస్థితి నెలకొంది. గత ఏడాది మేలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జయలలిత సారధ్యంలోని అన్నా డిఎంకె ఘనవిజయం సాధించి, వరుసగా రెండవసారి అధికారంలోకి రావడం అందరికీ తెలిసిందే. తమిళనాడు ప్రజల్లో జయలలితకు ఉన్న ఆదరణకు ఇది నిదర్శనం. ఆ తర్వాత జయలలిత అనారోగ్యంతో బాధపడుతూ గత డిసెంబర్‌లో మృతి చెందడంతో తమిళనాడు రాజకీయ సంక్షోభంలో చిక్కుకుపోయింది. ఒక బలమైన, ప్రజాదరణ నిండుగా మెండుగా కలిగిన రాజకీయవేత్త లేకుంటే ఆ రాష్ట్రంలో పరిస్థితి ఎంత అస్తవ్యస్తంగా తయారవుతుందో తెలుసుకునేందుకు తమిళనాడే ఒక ఉదాహరణ. తమిళ ప్రజల ఆరాధ్యదైవంగా ప్రఖ్యాతి చెందిన జయలలిత లేని కొరత ఇప్పుడు తమిళనాడు రాజకీయాల్లో మరింత స్పష్టంగానే కనిపిస్తోంది. రోజుకో రాజకీయంతో తమిళనాడు అస్తవ్యస్త రాజకీయాల్లో అవస్తలు పడుతోంది. జయలలిత మరణానంతరం తమిళనాడు ముఖ్యమంత్రి పదవినధిష్టించిన పన్నీర్‌సెల్వం కూడా కొద్దిరోజుల్లోనే రాజీనామా చేసి శాసనసభాపక్ష నేతగా శశికళ పేరును ప్రతిపాదించి, ఆ తర్వాత తిరుగుబాటు చేయడం కూడా జరిగింది. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేయాల్సిన శశికళ అవినీతికేసులో ఇరుక్కొని జైలుపాలు కావడం మరో ఘట్టం. ఈ నేపథ్యంలో శశికళ ఆశీస్సులతో పళనిస్వామి ముఖ్యమంత్రి పదవి చేపట్టడం, శశికళ మేనల్లుడు, అన్నా డిఎంకె డిప్యూటి ప్రధానకార్యదర్శి, టీటీవీ దినకరన్ రంగప్రవేశంతో పళనిస్వామి కూడా శశికళకు దూరం కావడం, అప్పటినుంచి పళనిస్వామి ప్రభుత్వాన్ని దించేయాలని దినకరన్ ప్రయత్నాలు చేయడం ప్రారంభమైంది. ఈలోగా పన్నీర్‌సెల్వం - పళనిస్వామి వర్గాలు రెండూ ఒక్కటైపోవడం మరో ఘట్టం. దీంతో ఈ ఏకమైన రెండాకుల బలం నూటపదకొండైంది. అయితే, ఈ విలీనాన్ని వ్యతిరేకిస్తూ పళనిస్వామికి తమ మద్దతు ఉపసంహరించుకున్న 19 మంది ఎమ్మెల్యేలు దినకరన్ గూటికి చేరడం తమిళనాడు రాజకీయాలను మళ్ళీ ఒక మలుపు తిప్పింది. 234 మంది సభ్యులున్న తమిళనాడు అసెంబ్లీలో ప్రభుత్వం ఏర్పాటుకు కావాల్సిన సంఖ్యా బలం 117. అయితే, 98మంది ఎమ్మెల్యేలున్న విపక్షాలతో దినకరన్ వర్గం జతకలిస్తే పళనిస్వామి ప్రభుత్వం ఇరకాటంలో పడినట్లే. ఇది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే. దినకరన్ వర్గంలోని 19 మంది ఎమ్మెల్యేల్లో ఒకరు మాత్రం మళ్ళీ తాను పళనిస్వామికే మద్దతు ఇస్తున్నట్లు పేర్కొనడంతో, ఆ ఎమ్మెల్యేని మినహాయించగా, మిగిలిన 18మందిపై స్పీకర్ తాజాగా అనర్హత వేటు వేయడంతో దినకరన్ కథ మళ్ళీ మొదటికొచ్చింది. బలనిరూపణ జరపాలని కోరుతున్నా కాలయాపన జరగడం, బలపరీక్ష కోసం హైకోర్టు విధించిన గడువుకు రెండురోజుల ముందే దినకరన్ వర్గంలోని ఎమ్మెల్యేలపై అనర్హత వేటువేయడం జరిగింది. అయితే దీనివల్ల అవతలివారికి అవకాశం ఇచ్చినట్లయిందనే అభిప్రాయాలు సర్వత్రా వెల్లడవుతున్నాయి. దినకరన్ వర్గంలోని 18 మంది ఎమ్మెల్యేలపై అనూహ్యంగా అనర్హత వేటు పడడం సంచలనమైంది. తమిళనాడు స్పీకర్ ఆ మేరకు ఉత్తర్వులు జారీచేయడంతో దినకరన్ పరిస్థితి మళ్ళీ మొదటికొచ్చినట్లయింది. అయితే, అలా చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని దినకరన్‌వర్గం భావిస్తున్నా, జరగాల్సిన జాప్యం ఎటూ జరిగిపోయింది. అందుకు రాజకీయ కారణాలు ఉండవచ్చేమో! ఏదేమైనా, చివరికి కాగల కార్యం గంధర్వులు తీర్చినట్లు ఆ ఎమ్మెల్యేలపై అనర్హత వేటుకూడా పడిపోయింది. దీంతో కథ మళ్లీ కంచికి చేరినట్లయింది.

రాజకీయాలు సంక్షోభ స్థితిలో ఉన్నప్పుడు జరిగే వ్యవహారాలు ఇలాగే చిత్రవిచిత్రంగా ఉంటాయనేందుకు ఇలాంటి ఘట్టాలే ప్రత్యక్ష ఉదాహరణ. ఏదేమైనా, తమిళనాడులో రాజకీయ సంక్షోభం త్వరగా సమసిపోవాలనే అందరూ కోరుకునేది. ఎంతటి రాజకీయంలోనైనా, ఏ పరిస్థితుల్లోనైనా సరే, ఎవరి రాజకీయ మనుగడనో దృష్టిలో పెట్టుకోక, ప్రజాస్వామ్యబద్ధమైన రీతిలో అందరూ వ్యవహరించినప్పుడే అది సాధ్యమవుతుంది. మన ప్రజాస్వామ్య విలువలను మనం గౌరవించుకుంటూ ప్రజల అభ్యున్నతి లక్ష్యంగా రాజకీయ నాయకులు ముందుకు సాగాలి. విశుద్ధమైన రాజకీయాలే పదికాలాలపాటు నిలబడతాయి తప్ప, చిత్తం వచ్చిన రీతిలో వ్యవహరించుకుంటూపోతే ఇలాంటి సంక్షోభ రాజకీయాలు ఎంతకీ ఒక కొలిక్కి రావు. ఇప్పటికిది సరైనదే అనుకున్నా, మరికొన్ని రోజుల్లో అక్కడ మళ్ళీ సీన్ మారిపోతుంటుంది. ప్రతినిత్యం ఇలా రోజుకో రాజకీయం తెరపైకి వస్తూనే ఉంటుంది. ఇవన్నీ తమిళరాజకీయాల్లో సర్వసాధారణమే.

అయితే, ఎవరైనా కోరుకునేది ప్రజాస్వామ్యబద్ధమైన, విశుద్ధమైన రాజకీయాలనే. తమిళనాట రాజకీయ సంక్షోభం త్వరగా సమసిపోయేందుకు, తమిళప్రజల ఆశలు, ఆకాంక్షలకు తగ్గట్లుగా అక్కడ అంతా సవ్యంగా సాగేందుకు కేంద్రం తగు చొరవ తీసుకోవాల్సివుంది. రాజకీయాల కన్నా..ప్రజల శ్రేయస్సే మిన్న కనుక, ప్రజల అభ్యున్నతికీ, ఆ రాష్ట్ర ప్రగతికీ బాటలువేస్తూ, అక్కడి రాజకీయ సమస్యలను కూడా రాజకీయవిజ్ఞులు చక్కగా పరిష్కరించాల్సి ఉంది.

---

### జాషువ అవార్డుకు
# చందు సుబ్బారావు

పద్మభూషణ్ నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువ 122వ జయంతిని పురస్కరించుకుని జాషువ అవార్డుకు ప్రముఖ సాహితీవేత్త, కవి, వక్త, ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు చందు సుబ్బారావును ఎంపిక చేయడం జరిగిందని జాషువా కవితాపీఠం వ్యవస్థాపక అధ్యక్షులు విద్వాన్ బూతపాటి కిరణశ్రీ, కార్యదర్శి కె.తిరుపాల్‌రెడ్డి, గౌరవాధ్యక్షులు విక్రమసింహపురి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య వీరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబర్ 7వ తేదీ జరుగనున్న మహాకవి జాషువ 122వ జయంతి మహాసభలో ఈ అవార్డు క్రింద రూ.5వేలు నగదు, ప్రశంసాపత్రం, దుశ్శాలువతో వీరిని సత్కరించడం జరుగుతుందన్నారు. సాహిత్యాభిమానులు, జాషువ కవితాప్రియులు ఈ సభలో పాల్గొని జయప్రదం గావించాలని కోరారు.

---

# రక్తదానంతో.. ప్రాణదానం

### - ఐఆర్‌సిఎస్ రాష్ట్ర శాఖ ఛైర్‌పర్సన్ రేచల్ ఛటర్జీ

రక్తదానంతో ప్రాణదానం చేస్తున్నామన్న విషయాన్ని దృష్టిలో వుంచుకుని వైద్యాధికారులు, సిబ్బంది తమ విధులను చిత్తశుద్ధితో నిర్వర్తించాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటి రాష్ట్ర శాఖ ఛైర్‌పర్సన్ రేచల్ ఛటర్జీ పేర్కొన్నారు. రెడ్‌క్రాస్ సొసైటి రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో నెల్లూరు మద్రాస్‌బస్టాండ్ సమీపంలో వున్న రెడ్‌క్రాస్ రక్తనిధి సమావేశ మందిరంలో ఆదివారం రక్తనిధి నిర్వహణ, రక్తనిధి సేవలలో నాణ్యతపై వైద్యులు, టెక్నీషియన్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ ప్రమాద బాధితులకు రక్తం అందించే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, రక్త సేకరణతో పాటు శుద్ధి చేసి భద్రపరిచే విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం తగదన్నారు. నెల్లూరుజిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో నెల్లూరు రెడ్‌క్రాస్ రక్తనిధి నిర్వహణలో ముందంజలో ఉండడం అభినందనీయమన్నారు. వైద్యులు, సిబ్బంది మరింత కృషి చేసి ఏ సమయంలో ఎవరొచ్చినా సకాలంలో రక్తం అందజేయాలని కోరారు. అనంతరం రక్తనిధి నిర్వహణను పవర్‌పాయింట్ ద్వారా ప్రదర్శించారు. ఏపి ఎస్‌ఎసిఎస్ బ్లడ్ సేఫ్టీ జాయింట్ డైరెక్టర్ చైతన్యకుమార్, డ్రగ్‌కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ సురేష్‌బాబు, రెడ్‌క్రాస్ రక్తనిధి న్యూఢిల్లీ డైరెక్టర్ వనశ్రీసింగ్, ఈఎస్‌ఐ వైద్యకళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు, స్విమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ అరుణ్, నారాయణ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ యశోవర్ధన్, రెడ్‌క్రాస్ జిల్లాశాఖ ఛైర్మెన్ ఏ.వి.సుబ్రహ్మణ్యం, వైస్‌ఛైర్మెన్ ఎల్వీ నరసారెడ్డి, ట్రెజరర్ మోహన్‌లాల్‌జైన్, రక్తనిధి కన్వీనర్ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

---




## రాజధాని పిచ్చి

ముఖ్యమంత్రి చంద్రబాబుకు అమరావతి రాజధాని పిచ్చి ముదిరినట్లుంది. మూడున్నర సంవత్సరాలుగా అలాంటి రాజధాని, ఇలాంటి రాజధాని అంటూ శంకుస్థాపనలు, డిజైన్‌లతోనే కాలం గడిపేసాడు. ఇంతవరకూ ఎలాంటి రాజధాని ఫైనల్ కాలేదు. చివరకు రాజధాని డిజైన్ల కొరకు సినీ దర్శకుడు రాజమౌళిని సంప్రదించడం సిగ్గు చేటు. అతను సినిమాకు సెట్టింగ్‌లు వేసుకుంటుంటాడు. సెట్టింగ్‌లు వేసుకున్న వాళ్లను రాజధానికి డిజైన్‌లు చేసి ఇమ్మని అడిగాడంటే చంద్రబాబు అంతర్జాతీయ మేధావితనం ఏపాటిదో అర్థమవుతోంది.

**షేక్ రఫీ, నెల్లూరు.**

## ఆనం వాళ్ళే నయం

నెల్లూరులో ఇప్పుడున్న పరిస్థితులను చూస్తుంటే గతంలో వున్న ఆనం వాళ్ళే నయమనిపిస్తోంది. కనీసం రోడ్లన్నా శుద్ధంగా వేశారు. నగరంలో అవసరమైన పనులే చేసారు. ఇప్పుడున్న పాలకులు చేస్తున్న పనులు చూస్తుంటే కేవలం డబ్బులు దోచుకోవడానికి పనులు చేస్తున్నట్లుగా వుంది. ప్రజలకు ఏ విధంగానూ ఉపయోగపడని కాంక్రీట్ డివైడర్లు, బ్యూటిఫికేషన్ పనులు చేస్తున్నారు. కాలువల్లో సిల్టు తీయడం గాని, గుంతలమైన రోడ్లను వేయడం, దోమలు, పందుల నిర్మూలన వంటి వాటిని గాలికి వదిలేసి, కేవలం తమ జేబులు నింపుకునే పనులే చేస్తున్నారు.

**పూసల శేషాద్రినాయుడు, నెల్లూరు.**

## విద్యార్థులతో ఆడుకోవద్దు

రాష్ట్రంలో విద్యావ్యవస్థ చాలా భ్రష్టుపట్టిపోయింది. ఆఖరకు త్రైమాసిక పరీక్షల పేపర్లను కూడా లీక్ చేసే స్థాయికి కార్పొరేట్ విద్యాసంస్థలు దిగజారాయి. 6 నుండి 10వ తరగతి వరకు త్రైమాసిక పరీక్షలను ఐదువేల రద్దు చేసారు. మూడు పరీక్షలు అయిన తర్వాత వీటిని రద్దు చేసి, దసరా సెలవుల తర్వాత పెడతామన్నారు. ఒకరు చేసిన వెధవ పనికి రాష్ట్రంలో వున్న లక్షలాది మంది విద్యార్థులను ఇబ్బందిపెట్టడం ఎంతవరకు సమంజసం. త్రైమాసిక పరీక్ష పేపర్లను కూడా లీక్ చేసిన వెధవలను ముందుగా గుర్తించండి. అలాంటి నీచులకు తగిన శిక్ష విధించి, వారిని ప్రోత్సహించిన విద్యాసంస్థల గుర్తింపును పూర్తిగా రద్దు చేయండి. అంతేగాని ఒకరు చేసిన పేపర్ లీకు లక్షలమంది విద్యార్థులకు శిక్ష వేయడం న్యాయమా?

**కె.సుశీల, పొదలకూరు.**

## వీధి కుళాయిలు, డ్రైనేజీ

నెల్లూరు నగరంలో అన్ని నివాసిత ప్రాంతాల్లో దాదాపు 70శాతం నివాసితులకు కుళాయి కనెక్షన్లు వున్నాయి. వారందరికి వినియోగదార్ల సంఖ్య ఇవ్వబడి నమోదు అయినదో లేదో తెలియనందువల్ల నమోదు కాబడిన కుళాయి కనెక్షన్ల యజమానులు మాత్రమే కుళాయి పన్నులు చెల్లిస్తున్నారు. ఎవరో ఒకరు, ఇద్దరు తప్ప వీధి కుళాయిలను ఉపయోగించుకోవడం లేదు. కొన్ని వీధి కుళాయిలను మురికి కాలువల్లో నిర్మించినందున, అక్కడ బాలురు కొంతమంది అలాంటి కాలువలలోనే మల, మూత్ర విసర్జనకు అలవాటు పడి వున్నారు. కనుక వీటి వలన నివాసితుల ఆరోగ్యానికి భంగకరంగా వుంది. కనుక వీధి కుళాయిలను నగర, అర్బన్ నివాసిత కాలనీలలో పూర్తిగా తొలగించాలని చాలా మంది కోరుతున్నారు.

**ఆర్.ఎస్.నాథ్, నెల్లూరు.**

# ఎన్‌బికెఆర్ విద్యా చరిత్రలో మరో మలుపు

- జపాన్ సంస్థతో కీలక ఒప్పందం
- 75 మంది విద్యార్థులకు ప్రతిభా నైపుణ్యంలో శిక్షణ

**నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి విద్యాసంస్థలు... రాష్ట్రంలోనే ఈ విద్యాసంస్థలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. విద్యా రంగానికి ఆధునిక సొగసులు అద్దిన విద్యాసంస్థ ఇది. నెల్లూరుజిల్లాలోనే మొట్టమొదటి ఇంజనీరింగ్ కళాశాల ఇది. స్వర్గీయ నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి, స్వర్గీయ నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి వంటి మహనీయుల మార్గనిర్దేశకంలో ఈ విద్యాసంస్థ అంచెలంచెలుగా ఎదుగుతూ కొన్ని వేలమంది ఇంజనీరింగ్ నిపుణులను సమాజానికి అందించింది. వారి ఆశయ సాధనలో పనిచేస్తూ వారి బాటలో నడుస్తూ ప్రస్తుత కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి కూడా ఈ విద్యాసంస్థలను అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్ళే ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రయత్నంలో భాగంగానే జపాన్‌కు చెందిన ఓ కంపెనీతో ఇటీవల కుదిరిన చారిత్రాత్మక ఒప్పందం.**

కోట మండలంలోని విద్యానగర్‌లో ఉన్న ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలతో మెడిన్‌షా కార్పొరేషన్ (టోక్యో), ప్రైమ్ మీడియన్ సంస్థ జపాన్ సాంకేతిక పరిజ్ఞాన నైపుణ్యం బదలాయింపు కోసం అవగాహనా ఒప్పందం జరిగింది. ఈ కార్యక్రమం కోసం ఇటీవల మెడిన్‌షా కార్పొరేషన్ డైరెక్టర్ హిరాకి వాకుయి, ప్రైమ్ మెడిన్ సంస్థ ప్రతినిధులు ఈ కళాశాలకు విచ్చేసి ఆ మేరకు ఒప్పందం కుదుర్చుకున్నారు. జపాన్ కంపెనీ నైపుణ్యంపై ఇక్కడి ఇంజనీరింగ్ విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు సంబంధించిన ఒప్పందపత్రాలను ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మెడిన్‌షా డైరెక్టర్ హిరాకి వాకుయి మాట్లాడుతూ, గతంలో ప్రధాని నరేంద్రమోడి జపాన్ పర్యటనకు విచ్చేసినప్పుడు అక్కడ ఉన్న తమ కంపెనీ డైరెక్టర్లతో చర్చించారని, భారతదేశంలో ప్రధాని మోడి నేతృత్వంలో స్కిల్ ఇండియా కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రధాని సూచన మేరకు తమ కంపెనీల పరిధిలోని పలు ఇంజనీరింగ్ కళాశాలలపై దృష్టి పెట్టడం జరిగిందని, అందులో తమకు అవసరమైన వసతులు, ప్రతిభాపాటవాలు కలిగిన విద్యార్థులు ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. ఇక్కడి కళాశాలలో 45 రోజుల పాటు 75 మంది విద్యార్థులకు తాము శిక్షణ ఇస్తామన్నారు. అందులో ఎలక్ట్రికల్ విభాగం నుంచి 60 మంది, మెకానికల్ విభాగం నుంచి 15 మందిని ఎంపిక చేసుకున్నామన్నారు. శిక్షణ అనంతరం ఒక నెలరోజుల పాటు మేనకూరులోని తమ కంపెనీలో ఇంటర్న్‌షిప్ ఇచ్చి దానిలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. అనంతరం కళాశాల కరెస్పాండెంట్ రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ, మెడిన్‌షా కంపెనీ తమ కళాశాలను ఎంపిక చేసుకుని విద్యార్థులకు శిక్షణ ఇచ్చి పూర్తి సహకారాన్ని అందిస్తున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. అందుకు ఆ సంస్థ ప్రతినిధులను అభినందిస్తున్నామన్నారు. తమ కళాశాలలో ప్రతిభాపాటవాలు కలిగిన విద్యార్థులను మరింతగా ప్రోత్సహించి వారికి ఉద్యోగావకాశాలు కల్పించాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఇందుకోసం కొన్ని బహుళజాతి సంస్థలతో అవగాహన కార్యక్రమాలు, ఎల్‌ఓఇ, ఇనుక్యుబేటర్ సెంటర్‌లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రైమ్ మీడియన్ ప్రతినిధులు విజయ కుమారన్, శాస్త్రి, కృష్ణ అయ్యర్, అభిజిత్ ప్రకాష్, కళాశాల సంచాలకులు డా. వి.విజయకుమార్‌రెడ్డి, వివిధ విభాగాధిపతులు, ప్రాంగణ ఎంపికల అధికారి డా. కిషాంధర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.









# వేట ముగిసిందా?

## లొంగిపోయిన 'చర'



జిల్లాలో బెట్టింగ్ కేసు దాదాపు ఓ కొలిక్కి వచ్చినట్లే కనిపిస్తోంది. ఈ కేసులో కీలక సూత్రధారిగా వున్న తెలుగుదేశం నాయకుడు, మాజీకౌన్సిలర్ దువ్వూరు శరత్ చంద్ర(చర) ఎట్టకేలకు పోలీసులకు లొంగిపోయాడు. అతనితో పాటు మరో బుకీ బాలకృష్ణమనాయుడు కూడా పోలీసులకు లొంగిపోయాడు. బెట్టింగ్ వ్యవహారంలో మరో నిందితుడు, శరత్‌చంద్ర కొడుకు సుభాష్ మాత్రం ఇంకా పరారీలోనే ఉన్నాడు. బెట్టింగ్ వ్యవహారం వెలుగులోకి వచ్చాక శరత్‌చంద్ర ఈ కేసు నుండి తప్పించుకోవడానికి ఎన్నో ప్రయత్నాలు చేసాడు. జిల్లా ఎస్పీ రామకృష్ణ సంగతి తెలిసి ఏ నాయకుడు కూడా ఇతనిని తప్పించమని ఎస్పీకి సిఫార్సు చేయలేదు. ఇక లాభం లేదనుకున్న శరత్‌చంద్ర సింగపూర్ పారిపోయాడు. అయితే, ఎన్ని రోజులని అక్కడ వుండగలరు. టూరిస్ట్ వీసా మీద వెళ్ళి వాళ్ళు ఎక్కువకాలం ఉండలేరు. అలా వుండాలన్నా ఇక్కడ బెట్టింగ్‌లో సంపాదించిన ఆస్తులన్నీ అమ్ముకోవాలి. ఈ నేపథ్యంలో శరత్‌చంద్ర ఇండియాకు తిరిగొచ్చి 18వ తేదీన పోలీసులకు లొంగిపోయాడు. అసలు జిల్లాలో బెట్టింగ్ రాకెట్‌పై ఎస్పీ ఇంత సీరియస్‌గా దృష్టి పెట్టడానికి కారణం ఈ ఏడాది జూన్‌లో జరిగిన ఓ సంఘటనే! నెల్లూరుకు చెందిన దారం మల్లిఖార్జున అనే వ్యక్తి తన భార్య మాధురి, కుమారుడు ప్రణవ్‌లతో కలసి రామేశ్వరంలో ఆత్మహత్య చేసుకోవడం. వారి ఆత్మహత్యలకు బెట్టింగ్ వేధింపులే కారణం. శరత్‌చంద్ర, సుభాష్‌ల వద్ద మల్లిఖార్జునరావు బెట్టింగ్‌లు కట్టి ఆర్థికంగా నష్టపోయాడు. ఈ బెట్టింగ్‌ల కోసం ఆస్తులమ్ముకున్నాడు. అయినా కూడా (మిగతా 11వ పేజీలో)


# టార్గెట్ 10





***రాష్ట్రంలో కడప, కర్నూలు జిల్లాల తర్వాత వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీకి కంచుకోట లాంటిది నెల్లూరుజిల్లా. ఒక్క 1983, 1994 ఎన్నికల్లో తప్పించి మిగతా ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభంజనం ఇక్కడ పెద్దగా పనిచేసిందేమీ లేదు. గతంలో తెలుగుదేశం కంటే కూడా కాంగ్రెస్సే బలంగా కనిపించేది. ఇప్పుడు కాంగ్రెస్ స్థానంలో వైయస్సార్ కాంగ్రెస్ ఈ జిల్లాలో బలంగా వుంది. 2014 ఎన్నికల్లో నెల్లూరు, తిరుపతి లోక్‌సభలను గెలవడంతో పాటు, ఉన్న 10 అసెంబ్లీ స్థానాలలో ఏడింటిని వైకాపానే గెలుచుకోవడం ఆ పార్టీ పటిష్టతకు అద్దం పడుతోంది. ఆ ఎన్నికల్లో పార్టీ సంస్థాగతంగా జరిగిన పొరపాట్ల వల్లనే మిగతా 3 స్థానాలైనా ఓడిపోయింది గాని, కరెక్ట్ ఎలక్షన్ చేసుంటే ఆ సీట్లు కూడా వచ్చివుండేవే!***

ఈసారి మాత్రం జిల్లాలో పది సీట్లను సాధించే దిశగా పార్టీ వర్గాలు పక్కా వ్యూహంతో పని చేస్తున్నాయి. జిల్లాలో 10 అసెంబ్లీ సీట్లను చేజిక్కించుకోవాలంటే ఎక్కడెక్కడ ఎవరిని అభ్యర్థులుగా పెట్టాలన్న దానిపై పెద్దఎత్తునే కసరత్తు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా అసెంబ్లీలు గెలవాలంటే లోక్‌సభ అభ్యర్థి కీలకం అవుతున్నాడు. ఎంపీ అభ్యర్థిని బట్టే అసెంబ్లీ అభ్యర్థుల గెలుపోటములు ఉంటున్నాయి. 2014 ఎన్నికల్లో నెల్లూరు పార్లమెంటు అభ్యర్థిగా మేకపాటి రాజమోహన్‌రెడ్డి పోటీ చేశాడు. అంతకుముందు రెండేళ్ళ క్రితం ఉపఎన్నికల్లో పోటీ చేస్తే దాదాపు 3లక్షల మెజార్టీతో గెలిచాడు. 2014లో కేవలం 13వేల ఓట్లతో బయటపడ్డాడు. నెల్లూరు లోక్‌సభ పరిధిలో 7అసెంబ్లీలుంటే 5అసెంబ్లీలలో వైకాపానే గెలిచింది. ఈ ఏడు చోట్ల అసెంబ్లీ మెజార్టీలు తీసుకుంటే టీడీపీ కంటే వైకాపాకే దాదాపు లక్ష ఓట్లు మెజార్టీ వుంది. కాని, లోక్‌సభకు వచ్చే సరికి క్రాస్ ఓటింగ్ జరిగి (మిగతా 11వ పేజీలో)


శ్రీ షిర్డి సాయిబాబా వారి మహా సమాధి, విజయదశమి మహోత్సవములు

గాంధీనగర్, ట్రంకురోడ్డు - నెల్లూరు.

తేది. 30-9-2017 శనివారం నుండి 02-10-2017 సోమవారం వరకు

పై దినములలో ప్రతిరోజు ఉ॥ 7.00గం.ల నుండి శ్రీ బాబా వారికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకములు జరుగును.

తదుపరి మధ్యాహ్నం 12గంటల నుండి సామూహిక అష్టోత్తర సహస్రనామ పూజలు జరుగును.

పై పూజలలో పాల్గొనదలచిన భక్తులు మందిర గుమస్తా వద్ద రూ.75/- చెల్లించి తగిన రశీదు పొంది బాబా వారి తీర్థప్రసాదములు స్వీకరించవలసినదిగా కోరుచున్నాము. పై దినములలో ప్రతిరోజు సా॥7.00గం.లకు సాంస్కృతిక కార్యక్రమములు జరుగును.

ఇట్లు: కార్యవర్గము

శ్రీ షిర్డి సాయి బాబా మందిరం

గాంధీనగర్, ట్రంకురోడ్డు - నెల్లూరు. ఫోన్. 0861 - 2327771.

# విద్యార్థులతో చెలగాటం



మార్కుల సంస్కృతి విద్యావ్యవస్థను సర్వనాశనం చేస్తోంది. మార్కుల కోసం కార్పొరేట్ విద్యాసంస్థలు కొన్ని ఎంతకైనా తెగిస్తున్నాయి. తమ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు అధిక మార్కులు తెచ్చుకోవాలని చెప్పి మిగతా విద్యార్థుల బ్రతుకులతో చెలగాటమాడుతున్నాయి.

పాత పరీక్షా విధానాన్ని రద్దు చేసిన ప్రభుత్వం గత ఏడాది నుండి సమ్మేటివ్ పరీక్షా విధానాన్ని ప్రవేశపెట్టడం తెలిసిందే! దీని ప్రకారం 8, 9, 10 తరగతులలో త్రైమాసిక, అర్ధసంవత్సర పరీక్షలలో వచ్చిన మార్కులను కూడా లెక్కించి పదో తరగతి పబ్లిక్ పరీక్షలలో వచ్చిన మార్కులకు 20మార్కులు కలుపుతారు. దీంతో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఈ మార్కుల కోసం కూడా కక్కుర్తి పడుతూ పేపర్ల లీక్‌లకు పాల్పడుతున్నాయి. వాట్సాప్, యూట్యూబ్‌ల ద్వారా పరీక్షా పత్రాలను ముందుగానే తమ విద్యార్థులకు అందేలా చేస్తున్నాయి.

మొన్ననే త్రైమాసిక పరీక్షలు మొదలయ్యాయి. మూడు పరీక్షలు జరిగాయో లేదో ప్రశ్నాపత్రాలు లీకయ్యాయి. దీంతో 8, 9, 10 తరగతులకు అప్పటివరకు జరిగిన పరీక్షలను రద్దు చేసి జరగాల్సిన పరీక్షలను వాయిదా వేశారు. టెన్త్‌లో ఈ మూడు తరగతులకు సంబంధించి 20 మార్కులు జతకలిపే విధానమే పేపర్ లీకులకు కారణం. ఇదెలా వుందంటే ఊరిలో ఒకడు దొంగతనం చేస్తే, దొంగ ఎవరో తెలియక ఊరందరినీ దొంగలని చెప్పి చావగొట్టినట్లుగా వుంది. మన రాష్ట్రంలో విద్యా వ్యవస్థ మొత్తం కార్పొరేట్ చేతుల్లో వుంది. మంత్రులుగా కూడా వాళ్ళే వున్నారు. కాబట్టి కార్పొరేట్ విద్యాసంస్థలు పేపర్లు లీక్ చేయడం పెద్ద సమస్య కాదు. దీనికంటే పాత పరీక్షా విధానాన్ని కొనసాగిస్తేనే విద్యార్థులు కొంచెం ప్రశాంతంగా నన్నా పరీక్షలు వ్రాసుకుంటారు.

## నెల్లూరు కబుర్లు

# రొట్టెల పండక్కి ముస్తాబు



దర్గా ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న మేయర్ అజీజ్, ఎస్పీ రామకృష్ణ

ప్రతి ఏటా నెల్లూరు నగరాన్ని మతసామరస్యవేదికగా మలిచే రొట్టెల పండక్కి బారాషహీద్ దర్గా ప్రాంగణం ముస్తాబవుతోంది. అక్టోబర్ 1వ తేదీ నుండి 5రోజుల పాటు రొట్టెల పండుగ నిర్వహించనున్నారు. దేశవిదేశాల నుండి లక్షలాదిమంది భక్తులు నెల్లూరుకు తరలి రానున్నారు. ఈ నేపథ్యంలో దర్గా ప్రాంగణం వద్ద భక్తుల సౌకర్యార్థం అనేక పనులు చేపట్టారు. స్వర్ణాల చెరువు ఘాట్‌ను నిర్మిస్తున్నారు. చెరువుకు వెళ్లే రోడ్డును సిమెంట్ రోడ్డుగా మారుస్తున్నారు. గతంలో కన్నా మిన్నగా రొట్టెలపండుగ నిర్వహణకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు.

# 'నారాయణ' సేవలు ఆదర్శం

### - వైద్యమంత్రి కామినేని కితాబు



నెల్లూరులోని నారాయణ మెడికల్ కాలేజీ, ఆసుపత్రి ఆరోగ్యసేవలు ఎంతో ఆదర్శనీయమని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి డా. కామినేని శ్రీనివాస్ ప్రశంసించారు. ఈనెల 16న ఆయన ఈ మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో దేశంలోని మొట్టమొదటి అధునాతన ఎఫ్‌డి-20 క్యాథ్ లాబ్, గుండె వైద్య చికిత్సల ప్రత్యేక అత్యవసర చికిత్సావిభాగం, సంజీవని బ్లాక్‌లను రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ఛైర్మెన్ డా. వై.రాజారావుతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, డా. పొంగూరు నారాయణ సేవలను కొనియాడారు. ఆయన సేవలు అమరావతికే ఆదర్శమన్నారు. రాష్ట్రంలోనే కాదు, దేశంలోనే ఎవ్వరూ ఇంత చక్కని ఆరోగ్యసేవలు అందించలేరని భావిస్తున్నానన్నారు. నారాయణ అందిస్తున్న మాతృసేవా పథకం మాతృమూర్తులకు ఒక వరమని అన్నారు. మానవసేవే మాధవసేవ అనే లక్ష్యంతో మంత్రి నారాయణ ప్రజలకు అందజేస్తున్న సేవలు ఆయా ప్రాంతాల ప్రజలకు ఒక అదృష్టమేనన్నారు. ఈ కార్యక్రమంలో డా. వై.రాజారావు, నారాయణ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ డా.పి.సింధూర, నారాయణ వైద్యవిద్యా సంస్థల డైరెక్టర్ డా.జి. సుబ్రహ్మణ్యం, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా.శ్రీరామ్‌సతీష్ తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమానికి మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డా. జి.వీరనాగిరెడ్డి అధ్యక్షత వహించారు.

# మార్కెట్‌లో జేసీ ఆకస్మిక తనిఖీ

### - నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక



నెల్లూరులోని ఏసి కూరగాయల మార్కెట్‌లో ఈనెల 16న జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఎవరైనా సరే, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన ఈ సందర్భంగా వ్యాపారులను, మార్కెటింగ్‌శాఖ అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు. మార్కెట్ పక్కన ఉన్న కోనేరుస్థలంలో కొత్తగా నిర్మించిన మార్కెట్ సముదాయాలను పరిశీలించారు. మార్కెటింగ్‌శాఖ, నగరపాలకసంస్థ, పోలీస్ శాఖ అధికారులు మార్కెట్‌ను పరిశీలిస్తుంటారని, వ్యాపారులు తమ షాపులను దాటి వ్యాపారాలు చేయరాదని పేర్కొన్నారు. మార్కెట్‌లో కొనుగోలుదారులకు ఇబ్బందులు లేకుండా దారి ఇవ్వాలని, మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జేసీతో పాటు మార్కెటింగ్ శాఖ కార్యదర్శి, వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ ఏ.డి ఉపేంద్ర కుమార్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# పెరిగిన మద్యం ధరలు

### మందుబాబుల జేబుకు చిల్లు

రాష్ట్ర వ్యాప్తంగా మద్యం ధరలు పెరిగాయి. ఈమేరకు ఎక్సైజ్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కో బ్రాండ్ మీద 30రూపాయల నుండి 200 రూపాయల వరకు రేటు పెరిగింది. ఇప్పటివరకు జిల్లాలో ఎక్సైజ్‌కు మద్యం అమ్మకాల ద్వారా 100కోట్ల ఆదాయం వస్తుండగా పెరిగిన ధరలతో అది 115కోట్లకు చేరనుంది. అయితే మద్యం ధరలు పెరిగినా, అమ్మకాలు ఏ మాత్రం తగ్గవు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# ఎన్‌సిసి క్యాడెట్ల స్వచ్ఛత అభియాన్



నెల్లూరులోని విఆర్ కళాశాల ఎన్‌సిసి నావెల్ క్యాడెట్స్ ఆధ్వర్యంలో, ప్రధాని పిలుపు మేరకు ఈ నెల 15 నుంచి సెప్టెంబర్ 2వ తేది వరకు స్వచ్ఛత హి సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్వచ్ఛత అభియాన్ కార్యక్రమాన్ని ఈ నెల 17న విఆర్ కళాశాల ఎన్‌సిసి నావెల్ క్యాడెట్లు నగరంలోని సుబేదార్‌పేట, ఎబిఎం హైస్కూల్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రం చేశారు. పిచ్చిమొక్కలు తొలగించి, మురికినంతా శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి క్యాడెట్లను ఉద్దేశించి విఆర్ కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ సబ్ లెఫ్టినెంట్ డా. ఎన్ ప్రభాకర్ మాట్లాడుతూ, పరిసరాలను పరిశుభ్రం చేసుకుంటే ప్రజలందరూ ఆరోగ్యంగా ఉంటారని, ప్రజలు ఆరోగ్యంగా ఉంటే దేశం ఆరోగ్యంగా ఉంటుందని అన్నారు. క్యాడెట్లు అందరూ తమ నివాస ప్రాంతాల్లో ఉన్న ప్రజలందరికి అవగాహనకు కల్పించి పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 10-ఆంధ్ర నావెల్ యూనిట్ ఎన్‌సిసి ఛీఫ్ హరిద్వార్ సింగ్, ఎస్.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు పండ్లు, రొట్టెలు



భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినం, విశ్వకర్మ జయంతిని పురస్కరించుకుని ఈనెల 17వతేదీ భారతీయ జనతాపార్టీ నగర కమిటీ అధ్యక్షులు మండ్ల ఈశ్వరయ్య ఆధ్వర్యంలో జయభారత్ హాస్పిటల్‌లోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి, అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, పలుకూరు జనార్ధన్, చిలకపాటి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ నగర, జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ దేశం కోసం అహర్నిశలు శ్రమిస్తూ దేశ ప్రగతిని ముందుకు తీసుకుపోతున్న భారత ప్రధాని నరేంద్రమోడీ కీర్తి నలుదిశలా వ్యాపిస్తూ ప్రపంచ దేశాలలో భారతదేశాన్ని విశ్వగురువుగా చూడాలని విశ్వకర్మ జయంతి సందర్భంగా కోరుకుంటున్నామన్నారు.

## ఏం జరిగింది... ఏం జరుగుతోంది...
# మాకు తెలియాలి!

### వాడివేడిగా స్టాండింగ్ కమిటి సమావేశం



నెల్లూరులో ఏం జరిగింది... ఏం జరుగుతోంది... మాకు తెలియాలి అంటూ నెల్లూరు నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటి సభ్యులు కార్పొరేషన్ అధికారులను నిలదీసారు. 18వ తేదీ మేయర్ అబ్దుల్ అజీజ్ అధ్యక్షతన కార్పొరేషన్ కార్యాలయంలో స్టాండింగ్ కమిటి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కమిటి సభ్యులు అధికారులపై ఆవేశపడ్డారు. మాకు తెలియకుండానే అన్ని నిర్ణయాలు మీరే తీసేసుకుంటున్నారంటూ సిటీ ప్లానింగ్, రెవెన్యూ అధికారులపై మండిపడ్డారు. ముఖ్యంగా పూర్తిస్థాయిలో ఫీజులు చెల్లించినా భవనాలను ఎందుకు క్రమబద్ధీకరించడం లేదంటూ సిటీ ప్లానింగ్ అధికారులను నిలదీసారు.

నగరంలో దోమలపై యుద్ధం ప్రకటించామని, ప్రతి డివిజన్‌కు ఒక ఫాగింగ్ మిషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు మేయర్ అజీజ్ వెల్లడించారు. విపిఆర్ ఫౌండేషన్, యాక్ట్, దొడ్ల సుబ్బారెడ్డి వంటి దాతల ద్వారా మరో నాలుగు పెద్ద ఫాగింగ్ మిషన్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మైపాడు గేటు వద్ద జాఫర్‌సాహెబ్ కాలువలో శివాలయం తెప్పోత్సవానికి వీలుగా శాశ్వత ఘాట్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. నగరాన్ని ఫ్రీ పోస్టర్ నగరంగా మారుస్తూ అందమైన ఆకృతులతో అలంకరింపజేస్తున్న కమిషనర్ ఢిల్లీరావును, అధికారులను సమావేశంలో అభినందించారు.

ఈ సమావేశంలో స్టాండింగ్ కమిటి సభ్యులు మామిడాల మధు, బూదూరు ప్రశాంతి కిరణ్, వెంకయ్యయాదవ్, మన్నెం పెంచలనాయుడు, అధికారులు పాల్గొన్నారు.

# ఆర్యవైశ్యుల మనోభావాలు దెబ్బతీయొద్దు

**- ఎమ్మెల్యే కోటంరెడ్డి**



ఆర్యవైశ్యుల మనోభావాలు దెబ్బతీసే విధంగా వున్న "సామాజిక స్మగ్లర్లు కోమటోళ్ళు" పుస్తకాన్ని వెనక్కు తీసుకోవాలని రచయిత కంచె ఐలయ్యకు నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని, రచయిత పుస్తకాన్ని వెనక్కు తీసుకోకుంటే ప్రభుత్వం దానిని నిషేధించాలని కోటంరెడ్డి కోరారు. ఆర్యవైశ్యులు శాంతి కాముకులని, అందరితో సఖ్యతతో ఉండేవారని, అనాదికాలంగా అనేక సేవా కార్యక్రమాలు చేసేవారని, అలాంటి వైశ్యుల కులాన్ని మొత్తాన్ని స్థంభించే రీతిలో ఎవరు వ్యాఖ్యలు చేసినా అది సమంజసం కాదన్నారు. ఏ కులం గురించి, మతం గురించి కించపరిచే హక్కు సెక్యులర్ భారత దేశంలో ఎవ్వరికీ లేదన్నారు. మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాములు, రామ్ మనోహర్ లోహియా లాంటి జాతిపితలు, మహానుభావులు ఆర్యవైశ్యులేనని అందరూ గుర్తుంచుకోవాలన్నారు.

## అలక వదిలి...
# ఆత్మకూరువైపు కదిలి...




***పూలమ్మినచోటే కట్టెలమ్మే పరిస్థితి వస్తే ఎవరికైనా మనసు కష్టంగా వుంటుంది. అలాంటి మనసు కష్టాన్నే ఇప్పుడు మాజీ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అనుభవిస్తున్నాడు. రాజకీయాలలో నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి వంటి ఏనుగుల్లాంటి వారిని ఢీకొన్న చరిత్ర వారిది. అలాంటి వాళ్ళకు గూటూరు కన్నబాబు అనే చిట్టెలుక నిద్ర లేకుండా చేస్తుంది. మన శ్శాంతి లేకుండా చేస్తోంది.***

రాష్ట్రంలో కాంగ్రెస్ పతనమైన తర్వాత రాజకీయంగా తీవ్రంగా నష్టపోయిన వారిలో ఆనం సోదరులు ప్రముఖంగా కనిపిస్తారు. కాంగ్రెస్‌ను వదిలేసి తెలుగుదేశంలో చేరాక వీరి పరిస్థితి దారుణంగా మారింది. కన్నబాబు లాంటివాళ్లు కూడా వీళ్లను లెక్కచేయని దుస్థితి వచ్చింది. తెలుగుదేశంలో చేరాక జిల్లా పెత్తనమంతా తమ గుప్పిట్లోకి వస్తుందని వీళ్ళు భావిస్తే, ఇన్‌ఛార్జ్‌గా ఇచ్చిన ఆత్మకూరు మీద కూడా వీళ్లకు పూర్తిగా పట్టు దొరకని పరిస్థితి. ఇక్కడ కన్నబాబు ప్రత్యేక వర్గాన్ని మెయింటేన్ చేసుకుంటూ జిల్లా పార్టీ ముఖ్య నాయకులందరితో టచ్‌లో వుంటున్నాడు. జిల్లా తెలుగుదేశం నాయకులు కూడా కన్నబాబుకే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు. ఇటీవల జరిగిన పార్టీ సమన్వయకర్తల సమావేశంలో కన్నబాబుకు అనవసర ప్రాధాన్యతనిచ్చారని చెప్పి ఆనం రామనారాయణరెడ్డి అసంతృప్తితో వెళ్లిపోయాడు. అప్పటినుండి ఆయన పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నాడు. ఈ నెల 11వ తేదీ నుండి ఇంటింటికి టీడీపీ కార్యక్రమాలు మొదలుకావడం తెలిసిందే! ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్‌లు తమ తమ నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాలలో తిరుగుతున్నా ఆనం మాత్రం ఆత్మకూరులో ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టలేదు. ఈ నేపథ్యంలో 18వ తేదీ విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఆనం రామనారాయణరెడ్డి ప్రత్యేకంగా భేటీ అయ్యాడు. ఒకటిన్నర గంట పాటు రాజకీయాలపై ఇద్దరూ చర్చించుకున్నారు. ఈయనేం అడిగాడో ఆయనేం చెప్పాడోగాని మొత్తానికి ఆనం అలకను వీడినట్లే కనిపిస్తున్నాడు.

## ప్రజల ఆదరణతో...
# విస్తరిస్తున్న విపిఆర్ సేవలు

### - 5వ విడతగా.. మరో 5 మండలాల్లో 'విపిఆర్ అమృతధార'



***ప్రముఖ దాత, పారిశ్రామికవేత్త, విపిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి జిల్లాలోని అనేక గ్రామాల్లో చేపడుతున్న విపిఆర్ అమృతధార కార్యక్రమం ప్రజల నుంచి మంచి ఆదరణ పొందుతోంది. పరిశుభ్రమైన నీరు అందుబాటులో లేని గ్రామాలతో పాటు, ప్రత్యేకించి నీటి వసతులు సక్రమంగా లేక ఫ్లోరైడ్ బారినపడుతున్న గ్రామాల వారికి ఈ పథకం ఒక వరంగా మారింది. దాహార్తితో తల్లడిల్లుతున్న ఎన్నో గ్రామాలకు శుద్ధమైన నీటిని అందించి వారి జీవితాలకు మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించాలనే ధ్యేయంతో ప్రారంభమైన 'విపిఆర్ అమృతధార' కార్యక్రమం పట్ల గ్రామీణ ప్రజలు ఎంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.***


ఈ బృహత్కార్యక్రమంలో భాగంగా ఇటీవల 5వ విడతగా కోవూరు నియోజకవర్గంలోని బుచ్చి, కొడవలూరు, విడవలూరు, కోవూరు, ఇందుకూరుపేట మండలాల్లో మినరల్ వాటర్ ప్లాంట్‌లను ప్రారంభించారు. తొలుత బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని పంచేడు గ్రామంలో ఏర్పాటుచేసిన మినరల్‌వాటర్ ప్లాంట్‌కు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి ప్రారంభోత్సవం చేశారు. ఆ గ్రామపెద్దలు కృష్ణారెడ్డి, శ్రీమతి వెంకటసుబ్బమ్మ, గ్రామసర్పంచ్ రమణమ్మ, విపిఆర్ వికాస్ యూత్ తదితరులసమక్షంలో ఈ ప్రారంభోత్సవం జరిగింది. అదేవిధంగా, కొడవలూరులోని రామన్నపాళెం గ్రామంలో వేమిరెడ్డి ప్రభాకరరెడ్డితో పాటు, ఆ గ్రామపెద్దలు వెంకయ్య, శ్రీమతి శంకరమ్మ, గ్రామ సర్పంచ్ మంజుల, దయాకర్‌రెడ్డితో పాటు గ్రామప్రజలు, విపిఆర్ వికాస్ యూత్ తదితరులందరి సమక్షంలో మినరల్ వాటర్‌ప్లాంట్‌కు ప్రారంభోత్సవం జరిగింది. ఆ తర్వాత, విడవలూరు మండలంలోని గాదెలదిన్నె గ్రామంలో గ్రామపెద్దలు మోహన్, శ్రీమతి లక్ష్మమ్మ, గ్రామసర్పంచ్ శేషయ్యల సమక్షంలో, కోవూరు మండలంలోని వేగూరు గ్రామంలో గ్రామపెద్దలు జంగమయ్య, శ్రీమతి జయమ్మ, గ్రామసర్పంచ్ దేవేంద్రమ్మ, విపిఆర్ వికాస్ యూత్, వేగూరు గ్రామ ప్రజల సమక్షంలో వాటర్‌ప్లాంట్‌కు ప్రారంభోత్సవం జరిగింది. అనంతరం ఇందుకూరుపేట మండలంలోని జగదేవిపేట గ్రామంలో గ్రామపెద్దలు శ్రీమతి కమలమ్మ, విపిఆర్ వికాస్ యూత్, గ్రామస్తుల సమక్షంలో మినరల్ వాటర్‌ప్లాంట్‌కు ప్రారంభోత్సవం జరిగింది. ఆయా గ్రామాల్లో వేమిరెడ్డికి ప్రజలనుంచి ఘనస్వాగతం లభించింది.

## ప్రజల ఆదరణే ఈ పథకానికి స్ఫూర్తి

**- విపిఆర్**

ఈ కార్యక్రమాల్లో వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి మాట్లాడుతూ ఈ అమృతధార పథకం ద్వారా ప్రజలకు శుద్ధి చేసిన మంచినీటిని అందజేసే అపూర్వ అవకాశం తమ విపిఆర్ ఫౌండేషన్‌కు కలగడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని, ఈ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజల ఆదరణే ఈ పథకానికి స్ఫూర్తి అన్నారు. ఆయా గ్రామాల ప్రజల అభ్యర్థన, గ్రామపంచాయతీల కోరిక మేరకు వారి సహకారంతో ఈ పథకాన్ని విజయవంతంగా ముందుకు తీసుకువెళ్తున్నామన్నారు. ప్రజలు అందజేస్తున్న ఆ స్ఫూర్తితోనే జిల్లా వ్యాప్తంగా నూరు మినరల్‌వాటర్ ప్లాంట్‌లను నెలకొల్పేందుకు పటిష్టమైన ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ పథకంతో పాటు ఆయా గ్రామాల్లో క్రీడాకారులకు, యువతకు ప్రోత్సాహాన్నిచ్చేవిధంగా క్రికెట్ కిట్‌లు, వాలీబాల్ కిట్‌లు అందజేస్తున్నామని, గ్రామీణ క్రీడాకారులు వాటిని సద్వినియోగం చేసుకుని జిల్లాస్థాయిలోనే కాక, రాష్ట్ర-జాతీయస్థాయిల్లో కూడా క్రీడానైపుణ్యం ప్రదర్శించి వారి ప్రతిభను చాటుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ప్రొ. వీరనారాయణరెడ్డి, విపిఆర్ ఫౌండేషన్ ఛీఫ్ కో-ఆర్డినేటర్ ఎన్.శంకర్, సింహపురి హాస్పిటల్స్ అధినేత కె.రవీంద్రరెడ్డి, కేతంరెడ్డి వినోద్ రెడ్డితో పాటు ఆయా గ్రామాల్లోని విపిఆర్ వికాస్ యూత్, గ్రామపెద్దలు, ప్రజలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



# శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానము

దుర్గామిట్ట, నెల్లూరు - 4. ఫోన్: 2322016

## 43వ శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవ సమాహ్వానము

మహాభిషేకం తేది 30-09-2017 వేకువన 4-00 గంటలకు

తేది 21-09-2017 నుండి తేది 30-09-2017 వరకు

### ఉత్సవ కార్యక్రమములు

| | | | | | |
|---|---|---|---|---|---|
| తేది.21-09-17 | గురువారము | శ్రీ చండీ అలంకారము | తేది.27-09-17 | బుధవారము | శ్రీ సరస్వతీ అలంకారము |
| తేది.22-09-17 | శుక్రవారము | శ్రీ భవాని అలంకారము | తేది.28-09-17 | గురువారము | శ్రీ దుర్గా అలంకారము |
| తేది.23-09-17 | శనివారము | శ్రీ గాయత్రి అలంకారము | తేది.29-09-17 | శుక్రవారము | శ్రీ మహిషాసుర మర్దిని అలంకారము |
| తేది.24-09-17 | ఆదివారము | శ్రీ అన్నపూర్ణ అలంకారము | | | |
| తేది.25-09-17 | సోమవారము | శ్రీ గజలక్ష్మి అలంకారము | తేది.30-09-17 | శనివారము | శ్రీ రాజరాజేశ్వరి అలంకారము |
| తేది.26-09-17 | మంగళవారము | శ్రీ కాళిక అలంకారము | | | రా॥ 9 గం.ల నుండి నగరోత్సవం |

| | |
|---|---|
| సహస్రనామ పూజ | రూ.600/- |
| శ్రీదేవి ఖడ్గమాల పూజ | రూ.300/- |
| అష్టోత్తర పూజ | రూ.150/- |

తేది 21-9-17 నుండి 30-9-17 వరకు ఆసక్తి గల భక్తులు సదరు పూజలకు తమ గోత్రనామాలు ఆలయ కార్యాలయం నందు నమోదు చేసుకొని శ్రీ అమ్మవారి కరుణాకటాక్షములకు పాత్రులు కాగలరు.

నిత్యప్రసాద వినియోగం కొరకు రూ.50,000/- డిపాజిట్‌గా చెల్లించి దానిపై వచ్చు వడ్డీతో ప్రతి సంవత్సరం తాము కోరిన తేదీన భక్తులకు ప్రసాద వితరణ కావించబడును.

365రోజులు శ్రీ అమ్మవారికి నిత్యపూజ చేయించుకొనదలచిన భక్తులకు శ్రీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట రోజు నుండి నిత్యపూజ చేసుకొనుటకు గాను దేవస్థాన కార్యాలయం నందు రూ.3,000/-లు చెల్లించి తమ గోత్ర నామములు నమోదు చేసుకొని తగు రశీదు పొందవలసిందిగా కోరుతున్నాము.

**రత్నం జయరామ్**, వ్యవస్థాపక ధర్మకర్త

**పి.కోదండరామిరెడ్డి**
సహాయ కమీషనరు మరియు కార్యనిర్వాహణాధికారి

అభివృద్ధికి కాదు..

# అవినీతికే వ్యతిరేకులం


## - వైఎస్సార్సీపి ఫ్లోర్‌లీడర్ రూప్‌కుమార్



పేదప్రజలు, విద్యార్థుల వద్ద నుంచి అక్రమంగా వసూలుచేసిన డబ్బుతో దొడ్డిదారిన మంత్రి అయిన నారాయణ పేదప్రజలను అడ్డుపెట్టుకుని దోపిడీ చేస్తుంటే, ప్రజల చేత ఎన్నుకోబడి నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తూ నిత్యం ప్రజల్లో ఉంటున్న మా ఎమ్మెల్యేకు ప్రశ్నించే హక్కు లేదా?..అని వైఎస్సార్సీపి ఫ్లోర్‌లీడర్ పి.రూప్‌కుమార్‌యాదవ్ ప్రశ్నించారు. నెల్లూరులోని రాజన్నభవన్‌లో ఈ నెల 17న ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో రూప్‌కుమార్ మాట్లాడుతూ, నెల్లూరు నగరంలో మంజూరైన 4,800 ఇళ్ళల్లో సుమారు 150 కోట్ల రూపాయల దాకా అవినీతి జరుగుతోందని తమ ఎమ్మెల్యే ఆధారాలతో సహా నిరూపించారని, బహిరంగ చర్చకు కూడా సిద్ధమన్నారని ఆయన గుర్తుచేశారు. చేసిన ఆరోపణలు తప్పు అని నిరూపిస్తే అందుకు క్షమాపణలు చెప్పి, మంత్రి నారాయణను సత్కరిస్తామని కూడా తమ ఎమ్మెల్యే చెప్పిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. వైఎస్సార్‌నగర్-రాజీవ్ గృహకల్పలో జరిగిన ఇళ్ళ నిర్మాణాలకు పోటీ పెట్టుకుందామా అని శ్రీనివాసులురెడ్డి ఛాలెంజ్ చేస్తున్నారని, అయితే అప్పటి వైఎస్సార్‌నగర్, రాజీవ్ గృహకల్ప కాంట్రాక్టర్లు, శాసనసభ్యులు వారి పార్టీలోనే వున్నారన్న విషయం మీకు ఆ మాత్రం తెలియదా అని ఆయన ప్రశ్నించారు. తెలంగాణాలో కూడా ఇదే టెక్నాలజీతో ఇళ్ళ నిర్మాణం జరుగుతోందని, అక్కడ చదరపు అడుగుకు 900 వసూలు చేస్తున్నారని, ఇక్కడ మాత్రం 2,200 వసూలు చేయడం ప్రజలను దోపిడీ చేయడం కాదా?..దీనిపై ఎక్కడైనా సరే చర్చకు సిద్ధమని అన్నారు. అసలు సమస్యను పక్కదారి పట్టిస్తూ, తమపై అనవసరమైన విమర్శలు చేయడం వల్ల ప్రయోజనం లేదన్నారు. తాము అభివృద్ధికి వ్యతిరేకం కాదని, అభివృద్ధి పేరుతో తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న దోపిడీకి మాత్రమే వ్యతిరేకులమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొణిదల సుధీర్, కర్తం ప్రతాప్‌రెడ్డి, దార్ల వెంకటేశ్వర్లు, వందవాశి రంగ, ఎం.డి ఖలీల్ అహ్మద్, ఓబిలి రవిచంద్ర, దామవరపు రాజశేఖర్, గోగుల నాగరాజు, దేవరకొండ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# 'సద్గురు సాయి సంకీర్తనం'

## భక్తిగీతాల సి.డి ఆవిష్కరణ 23న




ప్రముఖ నటుడు, దర్శకుడు, గీతరచయిత యస్ఎల్ నరసింహం రచించిన 'సద్గురు సాయి సంకీర్తనలు' భక్తిగీతాల ఆడియో సి.డి ఈనెల 23న ఆవిష్కరిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆ రోజు సాయంత్రం 6.30 గంటలకు నెల్లూరు టౌన్‌హాలు ప్రాంగణంలోని శ్రీ రేబాల లక్ష్మీనరసారెడ్డి (జూనియర్) స్మారక భవనం (ఏ.సి హాల్)లో జరిగే ఈ ఆవిష్కరణ మహోత్సవానికి సంగీత గేయధార సృష్టికర్త, వెంకటగిరి మాజీ ఎమ్మెల్యే డా. వి.బి.సాయికృష్ణ యాచేంద్ర విశిష్ట అతిథిగా పాల్గొంటారని, ప్రముఖ సినీకవి వెన్నెలకంటి సభకు అధ్యక్షత వహిస్తారని, 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి జ్యోతి ప్రకాశనంతో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో డా. ఎస్ఆర్‌కె స్కూల్ అధినేత, 'గురుబ్రహ్మ' పి.కృష్ణమూర్తి, ఓస్వీ(క్రిమ్స్) తిరుపతి పాండురంగ విఠలేశ్వర్‌లు ఆత్మీయ అతిథులుగా పాల్గొంటారని పేర్కొన్నారు. సద్గురుసాయి సంకీర్తనలను గానం చేసిన ప్రముఖ గాయకులు కొట్రా సరస్వతీప్రసాద్, శ్రీమతి పి.రమణవాణి, సంగీతం అందించిన బి.కె భరద్వాజ్ తదితరులు పాల్గొంటారని, సంగీత సాహిత్య కళాభిమానులందరూ విచ్చేసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయవలసిందిగా వారు విజ్ఞప్తి చేశారు.

## వియస్‌యూ సీఇగా సాయిప్రసాద్‌రెడ్డి

నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలంలోని కాకుటూరు వద్దనున్న విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్‌ఛార్జిగా సాయిప్రసాద్‌రెడ్డిని నియమిస్తూ వివిఎస్‌యు వైస్‌ఛాన్సలర్ వీరయ్య ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకు సిఇగా వున్న మురళీమోహన్‌ను గౌహతిలోని అసోం సైన్స్ అండ్ టెక్నాలజీకి సీఇగా బదిలీ చేయడంతో ఆయన బదిలీపై వెళ్లారు. సాయిప్రసాద్‌రెడ్డి ప్రస్తుతం డిప్యూటి రిజిస్ట్రార్‌గా, అడిషనల్ కంట్రోలర్‌గా పనిచేస్తూ సిఇగా సోమవారం అదనపు బాధ్యతలు తీసుకున్నారు.

# విద్యతోనే ఉన్నత శిఖరాలు

## - ఎస్పీ రామకృష్ణ



విద్యతోనే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని జిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ క్యాప్ చిన్నారులకు సూచించారు. మంగళవారం గూడూరు శ్రీకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో నెల్లూరు, కొండాయపాలెం గేటు సమీపంలో చైల్డ్ అండ్ పోలీస్ (ప్రాజెక్ట్(క్యాప్)లో చదువుతున్న ఏడు మంది విద్యార్థుల పుట్టినరోజు వేడుకలు జరిగాయి. దీనికి ఎస్పీ ముఖ్యఅతిథిగా విచ్చేసి చిన్నారులచే కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులందరూ అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించి క్యాప్‌కు తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. క్యాప్ సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానన్నారు. అనంతరం క్యాప్ ఆవరణంలో విజేత కంటి ఆసుపత్రి, రాగప్రణీత స్పీచ్ థెరపి ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. విశ్రాంత అధ్యాపకురాలు కుసుమ, విజయలక్ష్మిలు క్యాప్‌కు ఆర్ఓ యూనిట్‌ను బహుకరించారు. ఎస్‌కే బాబు నేషనల్ హ్యూమానిటి సొసైటి ఛైర్మన్ పిల్లలకు పుస్తకాలు, క్యాప్ బిల్డింగ్‌కు ఎల్ఇడి బల్బులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర ఇన్‌ఛార్జ్ డిఎస్పీ బాల సుందరం, ఆర్ఐ చంద్రమోహన్, 5వ నగర ఇన్స్‌పెక్టర్ జి.మంగారావు, శ్రీకృష్ణ సేవాసమితి వ్యవస్థాపక గూడూరు అధ్యక్షుడు మయూరి శ్యాంయాదవ్, గంగుల మధుసూదనరావు, రామచంద్రారావు, విజేత కంటి ఆసుపత్రి వైద్యులు హజరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## గూడూరు డివిజన్ వార్తలు

# మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయం

## - ఛైర్‌పర్సన్ దేవసేన




గూడూరు మున్సిపల్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని, ప్రతి ఒక్కరు కూడా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని స్వచ్ఛగూడూరుగా ఉంచేలా చూడాలని ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన తెలిపారు. గూడూరు పట్టణంలోని జిఎస్ఆర్ పురపాలక ఉన్నత పాఠశాలలో స్వచ్ఛత్ సేవ కార్యక్రమాన్ని విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ విద్యార్థులు తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేలా తల్లిదండ్రులకు, గ్రామాల్లో, పట్టణాల్లో, వీధుల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులు ప్రతిఒక్కరూ పాఠశాలలో, పరిసరాల్లో చెట్లను విరివిగా నాటి వాతావరణ కాలుష్యం నివారించాలని తెలిపారు. పురపాలక అభివృద్ధి కోసం అనుక్షణం కృషి చేసి అవసరమైన సహాయ సహకారాలు అన్ని వేళలా అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బిల్లు చెంచురామయ్య, బాలిబోయిన రమేష్, ఇస్రాయిల్ కుమార్, చంద్రయ్య, శ్రీనివాసులు, తెలుగుదేశం పార్టీ నాయకులు కోదండయ్య, నరసరాజు, ప్రధానోపాధ్యాయులు మున్వర్ భాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

## నెల్లటూరు హైస్కూల్

# సైకిల్ స్టాండ్ ప్రారంభం



సైకిల్ స్టాండ్‌ను ప్రారంభిస్తున్న తహశీల్దార్ వెంకటేశ్వర్లు, డా॥ రోహిణి, సౌందర్యమ్మ, పి.ప్రభారెడ్డి తదితరులు

గూడూరు ఆంధ్రమహిళా మండలి మరియు ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో నెల్లటూరు ప్రభుత్వ పాఠశాలలో రొటేరియన్ ఎస్.వి.అశోక్‌చక్రవర్తి వారి తల్లి కీ॥శే॥ ఎస్.వి.శారదమ్మ జ్ఞాపకార్థం నిర్మించిన సైకిల్ స్టాండ్‌ను గూడూరు తహశీల్దార్ వెంకటేశ్వర్లు, ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి, అధ్యక్షురాలు సౌందర్యమ్మ, ఇన్నర్‌వీల్ అధ్యక్షురాలు పి.ప్రభారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలు బాగా చదువుకుని ఉన్నత స్థితికి రావాలని కోరారు. అశోక్‌చక్రవర్తి వారి తల్లి శారదమ్మ జ్ఞాపకార్థం 10 సంవత్సరాల నుండి ప్రభుత్వ పాఠశాలల్లో ఏదో ఒక కార్యక్రమం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు విష్ణువందన, వై.లక్ష్మి, డాక్టర్ జయలక్ష్మి, జమున, పద్మ, మైథిలి, డాక్టర్ సుగుణ, జీవని, సీతాదేవి, రొటేరియన్లు కె.సుందరరామిరెడ్డి, పి.జానకిరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదల సాయంతోనే సంతృప్తి

## - లయన్స్ క్లబ్ జోన్ ఛైర్మన్ సురేష్‌బాబు



సమాజంలో నిరుపేదలకు సాయం చేయడంలో వున్న సంతృప్తి ఎందులోనూ ఉండదని లయన్స్ క్లబ్ జోన్ ఛైర్మన్ సురేష్‌బాబు తెలిపారు. గూడూరు పట్టణంలో ప్రాంతీయ వైద్యశాలలో రోగులకు సౌకర్యంగా లయన్స్ ప్రతినిధులు మల్లెమాల మురళీరెడ్డి, రాంమ్మోహన్ సంయుక్తంగా 27వేలు దాతృత్వంతో వాటర్ ట్యాంకును పైపులైను ఇటీవల ఏర్పాటు చేశారు. తాజాగా లయన్స్ క్లబ్ జోన్ ఛైర్మన్ సురేష్‌బాబు చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నెలబల్లి భాస్కర్‌రెడ్డి, ప్రతినిధులు కడివేటి చంద్రశేఖర్, షేక్ రియాజ్‌అహ్మద్, జి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో లయన్ సుబ్బారావు, చెంచురామయ్య, డాక్టర్ చంద్రహాస్, రమణయ్య, మస్తాన్, శీనయ్య, రవీంద్ర, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఉమా, కమిటీసభ్యులు చెంచురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గల్పిక

# చంద్రబాబును ఆనందంతో ముంచెత్తిన సోమిరెడ్డి డిజైన్

ఉండవల్లిలోని హైటెక్‌రత్న ముఖ్యమంత్రి చంద్రబాబు క్యాంప్ కార్యాలయం. సీఎం ఛాంబర్‌లో మంత్రి పి.నారాయణ దిగులుగా కూర్చునివున్నాడు. అప్పుడే సింహపురి చాణక్య సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి అక్కడకు వచ్చాడు. దిగులుగా వున్న నారాయణను చూసి ఏం అలావున్నావని అడిగాడు. అందుకు నారాయణ... నా బాధ చెప్పేది కాదు, చూపిస్తాను చూడు... అంటూ సోమిరెడ్డి కళ్ల ముందు మస్కిటో కాయిల్‌ను గిరగిరా తిప్పి ఫ్లాష్‌బ్యాక్‌లోకి తీసుకెళ్లాడు.

★★★★★

అది 2014 నవంబర్ నెల. హైదరాబాద్‌లోని సచివాలయంలో సీఎం చంద్రబాబు కూర్చుని వున్నాడు. అప్పుడే మంత్రి నారాయణ సింగపూర్ కన్సార్టియం ప్రతినిధులు డాఫర్ డెన్, మిచెల్ మిల్లీ, టామ్ లొల్లి వచ్చారు. చంద్రబాబు ముందున్న టేబుల్‌పై వాళ్ళు ఒక చార్ట్‌ను పరిచారు. అమరావతి రాజధాని డిజైన్ అది. ఫ్లైఓవర్‌లు, నదులు, ఆకాశాన్ని తాకే భవనాలు, పూలవనాలు, చాలా ఆకర్షణీయంగా, రియల్ ఎస్టేట్ బ్రోచర్ మాదిరిగా తయారుచేసి చూపించారు. ఆ డిజైన్ చూసి చంద్రబాబుకు నిరుత్సాహం వచ్చింది. ఇలాంటి బ్రోచర్‌లను మా రియల్ వ్యాపారులు కుప్పలు కుప్పలుగా తయారు చేస్తారు. నాకు ఇంతకన్నా అందమైన డిజైన్ కావాలి అని చంద్ర బాబు చెప్పాడు. ఆయన మాటలతో నారాయణ, సింగపూర్ బృందం నీరసంగా వెనుదిరిగారు.

★★★★★

2015 మే నెల... హైదరాబాద్‌లోని తన ఇంట్లో చంద్రబాబు మనుమడు దేవాన్ష్‌తో ఆడుకుంటున్నాడు. అప్పుడే చైనా ఇంజనీరింగ్ కంపెనీ ప్రతినిధులు టెన్‌పింగ్, జంగ్ జూయింగ్‌లను వెంటబెట్టుకుని మంత్రి నారాయణ వచ్చాడు. చంద్రబాబు ముందు వాళ్లు తెచ్చిన అమరావతి రాజధాని డిజైన్‌ను ఉంచారు. అన్నీ చైనా సంస్కృతిని తలపించే రీతిలో డిజైన్ చేశారు. ఈ భవనాలు ఎంతకాలం నాణ్యంగా ఉంటాయని చంద్రబాబు అడిగాడు. దానికి చైనా ప్రతి నిధులు... మా చైనా వస్తువులు మాదిరిగానే మేం కట్టే భవనాలకు కూడా గ్యారంటీ వుండదని చెప్పారు. ఇలాంటి గ్యారంటీ లేని కట్టడాలు కట్టడంలో మేం మీకన్నా ఎక్స్‌పర్ట్స్‌మి... ఇలాంటి డిజైన్‌లు మాకు అవసరం లేదని చంద్రబాబు వారిని పంపించేశాడు.

★★★★★

2016 జూన్ నెల... ఉండవల్లిలోని తన కార్యాలయంలో చంద్రబాబు కూర్చుని వున్నాడు. ఈసారి మంత్రి నారాయణ జపాన్ ఇంజనీరింగ్ కంపెనీ ప్రతినిధులు అకిహిటో, టోకోనషి, మిత్సు బుషిలను వెంటబెట్టుకుని వచ్చాడు. వాళ్ళు తమ రాజధాని డిజైన్‌ను బాబు ముందుంచారు. భవనాలన్నీ నిలువెత్తు పొగగొట్టాల మాదిరిగా వున్నాయి. వాటిని చూడగానే చంద్రబాబుకు ముద్దనూరు థర్మల్ పవర్‌ప్రాజెక్ట్ గుర్తుకొచ్చింది. నేనడిగింది రాజధాని డిజైన్... పవర్ ప్లాంట్ డిజైన్ కాదు, ఇది నాకు నచ్చలేదు అని చెప్పి చంద్రబాబు వారిని పంపించేసాడు.

★★★★★

2017 సెప్టెంబర్... వెలగపూడిలోని సచివాలయంలో చంద్రబాబు వుండగా ఈసారి లండన్‌కు చెందిన నార్మన్‌పోస్టర్ బృందంతో మంత్రి నారాయణ వచ్చాడు. ఆయన రావడమే నీరసంగా వచ్చాడు. చంద్రబాబు ముందు వాళ్ళు తెచ్చిన అసెంబ్లీ, సచివాలయం డిజైన్‌లను పెట్టారు. ఆ డిజైన్‌ను చూడగానే చంద్రబాబు... ఈ డిజైన్‌ను నేను ఎక్కడో చూసాను అని మనసులో అనుకుంటుండగా... అప్పుడే మంత్రి పత్తిపాటి పుల్లారావు వచ్చాడు. ఆ డిజైన్‌ను చూసి ఆయన... అమరావతిలో ఏమన్నా బస్ టెర్మినల్ కడుతున్నారా అని అడిగాడు. ఎందుకు ఆ డౌట్ వచ్చిందని చంద్ర బాబు అడిగాడు. చెన్నైలో కోయంబేడు బస్టాండ్ కూడా ఇదే విధంగా ఉంటుందని పత్తిపాటి అన్నాడు. అప్పుడు చంద్రబాబుకు గుర్తొచ్చింది... తాను చూసాను అనుకుంటున్నది కూడా ఆ బస్టాండేనని. మంత్రి నారాయణకు విషయం అర్థమైంది... లండన్ ఇంజనీర్లను తీసుకుని మౌనంగా బయటకు వచ్చాడు.

★★★★★

ఇక్కడితో నారాయణ ఫ్లాష్‌బ్యాక్ ముగించి.. సీఎం గారికి ఏ డిజైన్ చూపించినా నచ్చడం లేదు... నాకు ఓపిక నశించిపోతుంది. ఇక అసెంబ్లీ, సచివాలయం డిజైన్‌ల విషయంలో ఆయనను ఒప్పించగలనన్న నమ్మకం నాకు పోయింది అని బాధపడసాగాడు. అప్పుడు సోమిరెడ్డి, నారాయణ భుజం తట్టి... నువ్వేం దిగులుపడకు, రేపటికల్లా నీ సమస్యను పరిష్కరిస్తా అని హామీ ఇచ్చాడు.

★★★★★

ఉండవల్లిలోని క్యాంప్ కార్యాలయంలో చంద్రబాబు, మంత్రులు దేవినేని ఉమ, పత్తిపాటి, కె.ఇ.కృష్ణమూర్తి, యనమల రామకృష్ణుడు కూర్చుని వున్నారు. అప్పుడే సోమిరెడ్డి, నారాయణలు లోపలకు వచ్చారు. సోమిరెడ్డి తన చేతిలో వున్న ఓ మ్యాప్‌ను నారాయణకిచ్చి చంద్రబాబుకు చూపించమన్నాడు. నారాయణ దానిని మడత విప్పి చంద్రబాబు టేబుల్ మీద పరిచాడు. ఆ మ్యాప్‌లో వున్న డిజైన్ చూడగానే చంద్రబాబు కళ్ళు ఆనందంతో మెరిసాయి. ఎత్తైన భవనాలు, ఉద్యానవనాలు, అందమైన రహదారులు... చంద్రబాబు దానిని చూస్తూ... ఇది కదా డిజైన్ అంటే... ఈ డిజైన్ ప్రకారం అసెంబ్లీ, సచివాలయం కడితే వుంటది నా సామిరంగా... అని సంబరపడిపోసాగాడు. మిగతా మంత్రులు కూడా ఈ డిజైన్ అద్భుతంగా వుంది... అంటూ నారాయణను అభినందించసాగారు.

సీఎం ఓకే అనడంతో నారాయణ హమ్మయ్యా అనుకుంటూ సోమిరెడ్డిని తీసుకుని బయటకొచ్చాడు. సోమిరెడ్డికి థ్యాంక్స్ చెప్పి... ఈ డిజైన్ ఏ దేశస్థుల చేత గీయించావని నారాయణ అడిగాడు. అది దేవరహస్యం... ఎవరికీ చెప్పకూడదని సోమిరెడ్డి అన్నాడు. దానికి నారాయణ... అమ్మతోడు... నేనెవరికీ చెప్పను... ఈ రహస్యం మనిద్దరి మధ్యనే సమాధైపోతుంది... ప్లీజ్ చెప్పవా అని అడిగాడు. అప్పుడు సోమిరెడ్డి నారాయణ చెవికి దగ్గరగా తన నోరు పెట్టి... చింతారెడ్డి పాళెంలో వున్న మీ మెడికల్ కాలేజీ క్యాంపస్‌నే హెలికాప్టర్ ద్వారా ఫోటో తీయించాను, ఆ ఫోటోనే ఈ డిజైన్ అని చెప్పాడు. ఆ మాటలు విన్న నారాయణ అరగంట తర్వాతగాని స్పృహలోకి రాలేకపోయాడు.

---

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

ఉద్యోగులు విధి నిర్వహణలో సామర్థ్యం ప్రదర్శిస్తారు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు పాటించండి. కొత్త వస్తువులు కొనడం, శుభవార్తలు వినడం జరుగుతుంది. లోన్లు, అడ్వాన్సులు మంజూరు కాగలవు. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. ఆర్థికాభివృద్ధికై మీ ప్రయత్నాలు సరిగా నెరవేరకపోవచ్చును. ఆదాయం సామాన్యం. శుభకార్య ఖర్చులు పెరుగుతాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

నిర్మాణ పనులు, కాంట్రాక్టు పనులు నిదానంగా జరుగుతాయి. ఉద్యోగులకు అధికారుల సహకారం బాగుంటుంది. కుటుంబ సౌఖ్యం, విద్యాప్రగతి బాగుంటుంది. అనుకున్న పనులు జరగడానికి పలువురిని కలుపుకొనిపోగల సమర్థత ఉంటుంది. ఆరోగ్యం బాగుంటుంది. ఆస్తి వ్యవహారాలు, ఆర్థిక వ్యవహారాలలో తొందరపడి నిర్ణయాలు చేయవద్దు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

గృహోపకరణాలు, విలువైన వస్తువులు సమకూర్చుకొంటారు. వృత్తి వ్యాపారాలు వేగంగా వృద్ధి చెందుతాయి. షేర్లు లాభిస్తాయి. అధికారులకు యజమానులకు వర్కర్లతో సమస్యలుంటాయి. స్థిరాస్తుల క్రయవిక్రయాలు జరుగగలవు. కోర్టు కేసులందు అనుకూలత, కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. చేపట్టిన పనులు సానుకూలం కాగలవు. పదవులు, సభ్యత్వాలు చేపట్టుతారు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

శుభకార్యములు నిర్ణయం కాగలవు. రావలసి బాకీలు కొంతవరకు అందుతాయి. ప్రభుత్వ అనుమతులు బ్యాంకు ఋణాలు లభిస్తాయి. ఉద్యోగులకు అధికారుల ఆదరణ ప్రోత్సాహకాలు లభిస్తాయి. నిరుద్యోగులకు అవకాశాలు లభించగలవు. ఆరోగ్యం బాగుంటుంది. విద్యా ప్రగతి కలదు. వృత్తి వ్యాపారాలలో ఆదాయం బాగుంటుంది. మంచి అనుభవం సంపాదిస్తారు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

మంచి శుభకార్య నిర్వహణ బాధ్యత నిర్వహించవలసి వస్తుంది. ప్రముఖులతో పరిచయాలు, కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. స్థిరాస్తుల లావాదేవీలు జరుపుతారు. ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలించగలవు. వృత్తి వాణిజ్యాలలో మంచి అవకాశాలు లభిస్తాయి. ఆదాయం బాగుంటుంది. కోర్టు వ్యవహారాలలో అనుకూలత శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

శుభకార్యాలలో పాల్గొంటారు. దిగువ ఉద్యోగులతోను, సహచరులతోను చిన్నచిన్న ఇబ్బందులుంటాయి. ఆరోగ్యం కూడా సంతృప్తికరంగా ఉండదు. అనుకోని ప్రయాణాలుండవచ్చును. ఆర్థిక లావాదేవీలు, క్రయ విక్రయాలలో తొందరపడవద్దు. పనులు జరిపేటప్పుడు టెన్షన్ ఎక్కువుగా వుంటుంది. ఖర్చులు అదనంగా ఉంటాయి. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

**తేది. 22.9.2017 నుండి**
**తేది. 28.9.2017 వరకు**

ఈ వారం కర్కాటకంలో రాహువు, సింహంలో కుజశుక్రబుధులు, 26వ తేదీ నుండి కన్యలో బుధుడు, కన్యలో రవి, తులలో గురువు, వృశ్చికంలో శని, మకరంలో కేతువు, కన్య తుల వృశ్చిక ధనుః రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము**

తేది 27 బుధవారము సరస్వతీపూజ, తేది 28 గురువారము దుర్గాష్టమి, తేది 29 శుక్రవారము మహర్నవమి, తేది 30 శనివారము విజయదశమి

**మహూర్తములు**

తేది 22 శుక్రవారం రాత్రి 6.45 నుండి 8.32లోగా మేష లగ్నమున వివాహ, గృహప్రవేశము. రాహు కేతువుల మధ్య గ్రహములుండి కాలసర్ప దోషము జరుగుచున్నది.

**ఆశ్వయుజ మాస శుక్లపక్ష తిధులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 22 | శుక్ర | విదియ | ఉ॥ గం.10.0వ॥ |
| తేది. 23 | శని | తదియ | ఉ॥ గం.10.34వ॥ |
| తేది. 24 | ఆది | చతుర్థి | ప॥ గం.11.40వ॥ |
| తేది. 25 | సోమ | పంచమి | ప॥ గం.1.00వ॥ |
| తేది. 26 | మంగళ | షష్ఠి | ప॥ గం. 3.00వ॥ |
| తేది. 27 | బుధ | సప్తమి | సా॥ గం.5.10వ॥ |
| తేది. 28 | గురు | అష్టమి | రా॥ గం.7.05వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఇంటికి కొత్త సదుపాయాలు వసతులు సమకూర్చుకొంటారు. విద్యాప్రగతి బాగుంటుంది. ఆరోగ్యం మీకు ఫరవాలేదు. కళాక్రీడా రంగాల వారికి ప్రోత్సాహం బాగుంటుంది. కుటుంబంలో చిన్న చిన్న విషయాలపై విభేదాలు రావచ్చును. వ్యాపార వర్గాలకు కొద్ది ఒడిదుడుకులుండినా ఆదాయం సంతృప్తికరం. వృత్తి జీవనం గలవారు ఆర్థికంగా పుంజుకొంటారు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగలవు. మీ వృద్ధిని చూసి విమర్శించే వాళ్ళుంటారు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఆరోగ్య విషయంలోనూ ఆర్థిక వ్యవహారాలలో జాగ్రత్త వహించండి. పిల్లల వల్ల చిన్న సమస్యలుండవచ్చును. విద్యాప్రగతి బాగుంటుంది. ముఖ్య నోటీసులు, పత్రాలు అందుకుంటారు. తలపెట్టిన పనులు నిదానంగా జరగడం వల్ల టెన్షన్ ఉంటుంది.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కొత్త వస్తువులు, విలువైన వస్తువులను ఖరీదు చేస్తారు. పొదుపు పథకాలపై దృష్టి పెడతారు. కాంట్రాక్టర్లు, పారిశ్రామికవేత్తలకు అభివృద్ధి బాగుంటుంది. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరుకుతాయి. విద్యా ప్రగతి బాగుంటుంది. పెద్ద కార్యక్రమాల బాధ్యత వహించవలసి వస్తుంది. కుటుంబంలో చిన్నచిన్న వ్యవహార సమస్యలుంటాయి. ఆదాయం పెరుగుతుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

ఉద్యోగ ప్రయత్నాలు ఫలించగలవు. షేర్లు కొంత నిరుత్సాహాన్ని కలిగిస్తాయి. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. ఆరోగ్య విషయంలో శ్రద్ధ అవసరం. దూర ప్రయాణాలుంటాయి. కోర్టు కేసులందు అనుకూలత కలదు. మీ వ్యాపార పథకాలు ఫలించి లాభాలు సమకూర్చుకొంటారు. వృత్తి జీవనం కలవారికి ఆర్థికంగా బాగుంటుంది. వస్తువాహన రిపేర్లుంటాయి.


## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ముఖ్యపత్రాలు, డబ్బును జాగ్రత్త పరుచుకొనండి. ఉద్యోగులకు ప్రోత్సాహకాలుండినా పనిభారం పెరగడం, అధికారుల అజమాయిషీ ఎక్కువగా ఉండవచ్చును. కుటుంబసౌఖ్యం, విద్యాప్రగతి బాగుంటుంది. వ్యాపారాలు, వృత్తి జీవనాలు లాభసాటిగా సాగుతాయి. ఆదాయం పెరుగుతుంది. అనుకున్న పనులను సమర్థవంతంగా జరుపుకొంటారు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉద్యోగులు పబ్లిక్‌తోను, అధికారులతో జాగ్రత్తగా మెలగండి. పనులందు టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. ఎంత ఇబ్బందులుండినా సమర్థత బాగుండి గుర్తింపు పొందుతారు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఆర్థిక పరిస్థితులు ఇబ్బందికరంగా ఉంటాయి. శుభకార్యాల ఖర్చులు, ప్రయాణ ఖర్చులు పెరుగుతాయి. పలుకుబడి పట్టుదలతో అనుకున్న పనులు జరుపుకుంటారు.

# నేత్రపర్వంగా.. మొదలైన దసరా ఉత్సవాలు



## భక్తులతో కిటకిటలాడుతున్న శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం

భక్తుల కొంగుబంగారం, కోరిన కోరికలు తీర్చే కల్పవల్లి.. శ్రీ రాజరాజేశ్వరి దేవి. అమ్మవారి కరుణ ఉంటే చాలు.. ఎంతటి కష్టాలైనా తీరిపోతాయని..తమ జీవితాలు అమ్మవారి దయతో శుభప్రదంగా సాగిపోతాయని భక్తులు ప్రగాఢంగా విశ్వసిస్తారు. అందులోనూ శరన్నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని పూజించుకుంటే మరింత శుభదాయకం. అందుకే, భక్తులంతా పెద్దసంఖ్యలో అమ్మవారి ఆలయానికి తరలివస్తున్నారు. నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవ స్థానంలో ఈ నెల 21 నుంచి 43వ శ్రీ దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతుండడంతో భక్తుల రద్దీతో ఆలయం కిటకిటలాడు తోంది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త రత్నం జయరామ్, సహాయ కమిషనర్-కార్యనిర్వహణాధికారి పి. కోదండరామిరెడ్డిల నేతృత్వంలో అమ్మవారి శరన్నవ రాత్రి ఉత్సవాలు ఎంతో వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు, ఇబ్బందులు లేకుండా వీరు అన్ని చర్యలు తీసుకున్నారు. 21వ తేది గురువారం ఆశ్వీయుజ శుద్ధ పాఢ్యమి రోజున, హస్తానక్షత్రయుక్త తులా లగ్న పుష్కరాంశంలో ఉదయం7.45-9.30గంటల అమ్మవారి నవరాత్రి ఉత్సవాలకు ప్రారంభ సూచకంగా కలశ స్థాపన జరిగింది. రాత్రి 7.30 నుంచి శ్రీ చండీ అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ముఖ్యంగా నవరాత్రి ఉత్సవాలు వచ్చాయంటే నెల్లూరులోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయంలో వేడుకలకు కొదవుండదు. అమ్మవారికి విశిష్ట పూజలు, విశేషసేవలు, వైభవంగా వేడుకలు ఎంతో నేత్రపర్వంగా ఉంటాయి. ఈసారి కూడా ఆలయనిర్వాహకులు ఈ నవరాత్రి వేడుకలను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయంలో కొలువైవున్న అమ్మవారికి కన్నులపండువగా అలంకరణలు చేసి విశేష పూజలు నిర్వహిస్తున్నారు నవరాత్రి రోజుల్లో ప్రతినిత్యం అమ్మవారికి నిత్యపూజలతో పాటు, పూలంగిసేవ, మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, సహస్రనామ పూజ, శ్రీదేవి ఖడ్గమాల పూజ, అష్టోత్తర పూజలు, శోభాయమానంగా అలంకారసేవలు నిర్వహిస్తున్నారు. ఆలయ అర్చకులు తంగిరాల రాధాకృష్ణశర్మ ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఉదయం 9 నుంచి 11 గంటల దాకా సామూహిక నవావరణ పూజ నిర్వహిస్తున్నారు. వేదపండితులు ఏ.వి రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో ప్రతిరోజు ఉదయం 6 గంటలకు ఉభయదాతలచే అమ్మవారికి నిత్య చండీహోమాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా, 22న అమ్మవారికి శ్రీ భవాని అలంకారం నిర్వహించారు. అదేవిధంగా, 23న శ్రీ గాయత్రి అలంకారం, 24న శ్రీ అన్నపూర్ణ అలంకారం, 25న శ్రీ గజలక్ష్మి అలంకారం, 26న శ్రీ కాళిక, 27న శ్రీ సరస్వతి అలంకారాలను ఎంతో వైభవంగా నిర్వహించనున్నారు. 28న దుర్గాష్టమి రోజున శ్రీ దుర్గ అలంకారం మరింత కన్నులపండువగా ఉంటుంది. 29న మహర్నవమి సందర్భంగా శ్రీ మహిషాసురమర్ధిని అలంకారంలోనూ, 30న విజయదశమి రోజున శ్రీరాజరాజేశ్వరి అలంకారంలోనూ అమ్మవారు భక్తులకు దర్శన మిస్తారు. అనంతరం నగరోత్సవం మరింత వైభవంగా నిర్వహించనున్నారు. ప్రతిరోజు సాయంత్రం ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతి నిత్యం సాయంత్రం 5 నుంచి 6 గంటల దాకా ప్రముఖ ఆధ్యాత్మికవేత్త మండే లక్ష్మీనరసింహరావుచే ఆధ్యాత్మిక ప్రవచనాలు జరుగుతున్నాయి. సాంస్కృతికోత్సవాల్లో భాగంగా, ప్రపంచస్థాయిలో మూడుసార్లు గిన్నిస్ రికార్డ్ సాధించిన ప్రఖ్యాత గజల్గాయకుడు మ్యాస్ట్రో గజల్ శ్రీనివాస్చే ఈ నెల 27న 'భక్తిగాన లహరి' కార్యక్రమం కూడా ఏర్పాటుచేశారు.

## శ్రీ మహాలక్ష్మి దేవస్థానంలో...

నెల్లూరు ఫత్తేఖాన్పేట అరిగెలవారి వీధిలో 1958 సంవత్సరంలో శ్రీ మహాలక్ష్మి బాలసంఘం ఆధ్వర్యంలో స్థాపించిన శ్రీ మహాలక్ష్మి దేవస్థానంలో 59వ దసరా మహోత్సవాలు ఈ నెల 21వ తేదీ ఉదయం 8గంటలకు కలశస్థాపనతో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దేవస్థానం గౌరవాధ్యక్షులు తాంబరం ఆనందరావు, సిద్ధిమూర్తి, అధ్యక్షులు నగిరి చంద్రశేఖర్, కార్యదర్శి వడ్లమూడి గోపికృష్ణ మాట్లాడుతూ ఈ ఉత్సవాలు ఈ నెల 30వ తేదీ వరకు జరుగుతాయన్నారు. ప్రతిరోజు ఉదయం 7గంటల నుండి 11 గంటల వరకు అమ్మవారికి సహస్రనామార్చన, కుంకుమపూజలు, అష్టోత్తరములు నిర్వహిస్తామని తెలిపారు. నిత్యం దేవస్థానం వద్ద పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు అత్యంత వైభవంగా జరుగుతాయన్నారు. ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు జరుగుతాయని, భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో...

సింహపురి గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఈ నెల 21వ తేదీ నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలను ఈ నెల 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ పాలకమండలి ఛైర్మెన్ మెట్టు సురేష్బాబు, కార్యనిర్వహణాధికారి వేమూరి గోపి తెలిపారు. అమ్మవారికి ప్రతిరోజూ ఉదయం 7గంటలకు అభిషేకాలు, ఖడ్గమాల, అష్టోత్తర, సహస్రనామార్చనలు, 9గంటలకు చండీయాగం, పూలంగిసేవ, సాయంత్రం విశేషాలంకారాలు, రాత్రి 7గంటలకు పంచహారతులు, సామూహిక లక్ష కుంకుమార్చనలు, పల్లకీసేవలు జరుగుతాయన్నారు. ఈ ఉత్సవాల్లో భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

## వైభవంగా కలశ స్థాపన...

నెల్లూరు మినీబైపాస్రోడ్డులోని శ్రీ మహేశ్వరి పరమేశ్వరి కళ్యాణ మండపంలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి శరన్నవరాత్రి మహోత్సవాలు సందర్భంగా ఈ నెల 21వ తేదీ ఉదయం 9.55 గంటలకు చండి అమ్మవారి కలశస్థాపన వైభవంగా జరిగింది. ప్రతిరోజు అమ్మవారికి లలిత సహస్రనామపూజ, అష్టోత్తరపూజ, ఖడ్గమాల, త్రిశతి, చండీదేవి అష్టోత్తరం తదితర విశేషపూజలను, అలంకారాలను నిర్వహిస్తున్నట్లు శ్రీనివాస అగ్రహారం, రామ్మూర్తినగర్, వెంకట్రామాపురం భక్తమండలి సభ్యులు పేర్కొన్నారు.

## అలరించిన చిన్నారి వేషధారణ




నెల్లూరు, నవాబుపేట లోని బచ్పన్ స్కూల్లో ఇటీవల దసరా వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ స్కూల్లో యూకెజి చిన్నారి జి.యాషిక రాజరాజేశ్వరి అమ్మవారి వేషధారణతో అందరినీ ఆకట్టుకుంది. తెలుగుగంగ ప్రాజెక్ట్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్గా పనిచేస్తున్న జి.రాఘవేంద్రరావు మనుమరాలే ఈ యాషిక. ఈ చిన్నారి వేషధారణ చూసి ఉపాధ్యాయులు అభినందించారు.

## దివ్యాంగుడికి ముక్కాల చేయూత



స్పార్క్ ఇంటర్నేషనల్ పారా అథ్లెటిక్స్ అంతర్జాతీయ వికలాంగుల పోటీలకు ఎంపికైన మామిడి లక్ష్మయ్యకు సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ తరపున రూ.15వేలు ఆర్థిక సాయాన్ని ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ అందజేశారు. నెల్లూరు స్టోన్హౌస్పేటలోని ఆర్యవైశ్య భవన్లో మంగళవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడి అంగవైకల్యం ఉన్నా క్రీడల్లో రాణిస్తున్న లక్ష్మయ్యకు ఫౌండేషన్ తరపున సహాయసహకారాలు అందజేసినట్లు తెలిపారు. నగదు బహుమతితో పాటు అవసరమైన క్రీడా పరికరాలను అందించామన్నారు. వెంకట్, పబ్బిశెట్టి శ్రీనివాసులు, శ్రీరామ్సురేష్, సత్యకృష్ణ పాల్గొన్నారు.



## వెంకయ్యను కలిసిన భవన నిర్మాతలు

బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జాతీయ కెన్వన్షన్-2018లో ముఖ్యఅతిథిగా పాల్గొనవలసిందిగా ఆహ్వానించడానికి భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యని అసోసియేషన్ సభ్యులు కలిశారు. వెంకయ్యను కలసిన వారిలో సంఘం ప్రస్తుత అధ్యక్షుడు విజయరాఘవరెడ్డి, పూర్వ అధ్యక్షుడు బొల్లినేని శీనయ్య, కర్నాటక విభాగం ఛైర్మెన్ శ్రీనివాసులురెడ్డి, సంస్థ పక్షాన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సబిలిటి ద్వారా గ్రామీణ వికాసం కోసం పనిచేసే విభాగానికి అఖిలభారత ఛైర్మెన్గా వున్న బండి ఆదినారాయణరెడ్డి వున్నారు.

## సిఎంఆర్లో ఫిదా మొదటి వీక్లీ డ్రా



దసరా నవరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని నెల్లూరు సుబేదారు పేటరోడ్డు కనకమహల్ సెంటర్ వద్దనున్న సిఎంఆర్ చందన షాపింగ్మాల్లో ఆదివారం సిఎంఆర్ ఫిదా సేల్ వీక్లి డ్రా తీసారు. ఈ వీక్లీ డ్రాకు నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వీక్లీ డ్రా టీవీఎస్ స్కూటీ విజేతగా బూదూరుకు చెందిన కె.మార్కండయ్య నిలిచారు. అలాగే 17వ తేదీ డ్రాలను నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి, మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, జిల్లా ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటి ఛైర్మెన్ చాట్ల నరశింహారావు తీశారు. ఈ కార్యక్రమంలో సిఎంఆర్ చందన అధినేత మావూరి శ్రీనివాసరావు, రాజీ యాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య పాల్గొన్నారు. డైలీడ్రాలో ప్రతిరోజూ 9 మందికి మైక్రోఓవెన్, నాన్స్టిక్ గ్లాస్టాప్ స్టౌవ్, గ్రైండర్, హోమ్థియేటర్, మిక్సీ, రైస్కుక్కర్, ఇండక్షన్స్టౌవ్, డిన్నర్ సెట్లను అందజేస్తున్నట్లు మావూరి శ్రీనివాసరావు తెలిపారు. మేనేజర్ వాసు పాల్గొన్నారు.

**విజేతలు:** మైక్రో ఓవెన్ - పేర్ల రాజేశ్వరి, సతీష్ వంశీ, నాన్స్టిక్ - అరియా కర్రా, గ్లాస్టాప్ స్టౌవ్ - షేక్ ఫయాజ్, గ్రైండర్ - అర్పిత, హోంథియేటర్ - పి.భువనేశ్వరి, మిక్సి - పి.గౌతమి, రైస్కుక్కర్ - ఎన్.శ్రీవాణి, ఇండక్షన్స్టౌవ్ - బాబీ, డిన్నర్సెట్ - ఎం.విశాల్

## డిటిసి ఆర్ఐకి పదోన్నతి

నెల్లూరుజిల్లా శిక్షణ కేంద్రంలో ఆర్ఐగా పనిచేస్తున్న లక్ష్మయ్యకు పదోన్నతి లభించింది. తిరుపతి ఏఆర్ డిఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## స్కూల్ గేమ్స్ ఫెడరేషన్కు మైథిలి విద్యార్థులు



నెల్లూరుజిల్లా స్థాయిలో స్కూల్ గేమ్స్లో పాల్గొనేందుకు నెల్లూరు మైథిలి స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. మంగళవారం పాఠశాల కరస్పాండెంట్ మనోహర్రెడ్డి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు ఎస్.భాస్కర్సాయి కబడ్డి, ప్రణవ్ బాస్కెట్ బాల్, శామ్యూల్ ఫుట్బాల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

# ఏసీలకు ఎస్పీ చెక్

నెల్లూరుజిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లతో పాటు డిఎస్పీల కార్యాలయాల్లో సైతం ఏసీలు తొలగించాలని నెల్లూరుజిల్లా ఎస్పీ పిహెచ్‌డి రామకృష్ణ ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో 12డిఎస్పీ కార్యాలయాలతో పాటు సర్కిల్, పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ఏసీల వినియోగంతో పెద్ద ఎత్తున విద్యుత్ బిల్లులు రావడంతో వాటిని చెల్లించేందుకు ఆయా స్టేషన్లు, కార్యాలయాల అధికారులు ఆసక్తి కనపరచడం లేదు. దీంతో విద్యుత్‌శాఖ బిల్లులు చెల్లించాలని ఒత్తిడి పెంచింది. ఈ విషయం ఎస్పీ దృష్టికి రావడంతో విద్యుత్ బిల్లుల బకాయిలపై ఆరాతీయగా ఏసీల వినియోగమే ప్రధాన కారణమని తేలింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏసీలు ఎస్పీ, ఏఎస్పీ స్థాయి అధికారులు మినహా ఇతరులెవ్వరూ వినియోగించరాదు. ఈమేరకు డిఎస్పీ, సిఐ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్లలోని ఏసీలను తొలగించాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఏసీ కావాలనుకునే వారు తమ సొంత నిధులతో ప్రత్యేక విద్యుత్ మీటర్లను ఏర్పాటు చేసుకొని బిల్లులు చెల్లించుకోవాలని సూచించారు. దీంతో అవసరమైనవారు ప్రత్యేక మీటర్లకు దరఖాస్తు చేసుకుని వాటిని అమర్చుకునే పనిలో ఉన్నారు.

# రాజధానికి... రాజమౌళి సెట్టింగా?

(మొదటి పేజీ తరువాయి)

అభ్యర్థనను మొదట్లో రాజమౌళి తిరస్కరించాడు. తాను ఆర్కిటెక్ట్‌ని కాదని, తాము వేసే సెట్టింగ్‌లు తాత్కాలికమేనని సున్నితంగా నచ్చజెప్పి చూసాడు. కాని, ఏ స్థాయిలో ఒత్తిడి వచ్చిందోగాని చివరకు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి మాట్లాడి అమరావతికి వెళ్ళి అక్కడ స్థలాన్ని చూసొచ్చాడు. త్వరలో ఆయనను రాజధాని బృందంతో కలిపి లండన్ పంపించేందుకు కూడా ప్రయత్నాలు జరుగుతున్నాయి.

అమరావతి కాదు ఇది భ్రమరావతి అన్న విమర్శకుల మాటలు నిజమవుతున్న సూచనలు కనిపిస్తున్నాయి చంద్రబాబు వ్యవహారశైలి చూస్తుంటే! అసలు ఆయనకు ఎలాంటి రాజధాని కావాలో ఇంతవరకు ఆయనకే అర్థమైనట్లు లేదు. 2014లో అధికారంలోకి వచ్చింది మొదలు ఈ మూడున్నరేళ్ళు సగానికిపైగా కాలాన్ని రాజధాని నిర్మాణానికే ఖర్చుపెట్టారు. అయితే అక్కడ విరగబొడిచిందేమీ లేదు. గట్టి జల్లు పడితే స్లాబులంతా కారే తాత్కాలిక భవనాలను కట్టారు. రాజధాని నిర్మాణం కోసమంటూ సింగపూర్, చైనా, రష్యా, జపాన్, శ్రీలంక... ఇంకా పలు దేశాలు తిరిగారు. మన ఇంజనీర్లు మురికివాడలు కడతారంటూ రాజధాని డిజైన్‌ల కోసం విదేశీ కంపెనీలను ఆశ్రయించారు. ఒకటికి నాలుగుసార్లు రాజధానిలో శంకుస్థాపనలు జరిగాయి. రాజధాని కోసమంటూ 35వేల ఎకరాల భూములను పక్కనపెట్టి బీడుగా వుంచారు. ఈ మూడేళ్లలో ఆ భూముల్లో ఆరుసార్లు పంటలు పండేవి. కొన్ని వందలకోట్లు రాబడి వచ్చి వుండేది. అక్కడ పంటలు లేవు. అలాగని రాజధాని అభివృద్ధీ లేదు. అసెంబ్లీ భవనానికి ఇప్పటికే పలు డిజైన్‌లు మార్చారు. వివిధ దేశాల కంపెనీలు ఇచ్చిన డిజైన్‌లు చంద్రబాబుకు నచ్చలేదు. తాజాగా లండన్‌కు చెందిన నార్మన్ పోస్టర్ కూడా అసెంబ్లీ, హైకోర్టు భవనాల డిజైన్ ఇచ్చారు. అది కూడా ముఖ్యమంత్రికి నచ్చలేదు. చివరకు ఆయన మనసులో రాజమౌళి పడ్డాడు. బాహుబలి సినిమా రెండు పార్ట్‌లను చంద్రబాబు శ్రద్ధగా చూసినట్లున్నాడు. ఆ సినిమాల్లో కోటలు చంద్రబాబును ఆకట్టుకున్నట్లున్నాయి. అందుకని ఆయనకు రాజమౌళిపై గురి కుదిరింది. రాజమౌళి దగ్గరకే మంత్రి నారాయణను పంపించాడు. ఒక వ్యక్తి దగ్గరకు మంత్రి హోదాలో నారాయణ వెళ్ళడమంటే ప్రభుత్వమే వెళ్ళి ఆయన ముందు మోకరిల్లడం. దీని బదులు ఆయనను మొదట్లోనే సీఎం క్యాంప్ ఆఫీసుకు పిలిపించుకుని ఈ విషయంపై మాట్లాడుంటే కొంచెమన్నా ప్రభుత్వానికి గౌరవంగా ఉండేది. అసలు అసెంబ్లీ, హైకోర్టు భవనాల నిర్మాణానికి ఆర్కిటెక్చర్‌తో ఏ సంబంధం లేని రాజమౌళిని సాయం కోరడమే వింతగా వుంది.

2014లో సీఎం అయ్యింది మొదలు చంద్రబాబు అంతా సినీ మైకంలో పరిపాలన సాగిస్తున్నట్లుగా వుంది. గోదావరి, కృష్ణా పుష్కరాలంటే దర్శకుడు బోయపాటి రవి డైరెక్షన్‌లో షూటింగ్‌లు, సెట్టింగ్‌లు వేసారు. ఈ షూటింగ్ మూలంగానే గోదావరి పుష్కరాల్లో అంతమంది చనిపోయారు. ఇప్పుడు రాజధానికి రాజమౌళి సెట్టింగ్‌లంటున్నారు. ఒకటిన్నరేడాదిలో ఎన్నికలున్నాయి. ఈలోపు ఒరిజినల్ భవనాలు కట్టాలంటే కష్టమే! ఈ లెక్కన రాజధానిలో రాజమౌళి సెట్టింగ్‌లతో మాయ చేద్దామనుకుంటున్నారా? రేపు పోలవరం ప్రాజెక్ట్‌ను కూడా మరో దర్శకుడు వి.వి.వినాయక్ చేత వేయిస్తాడేమో! ఎందుకంటే అల్లు అర్జున్ నటించిన 'బన్ని' సినిమాలో పోలవరం డ్యాం సెట్టింగ్ వేయించింది ఆయనే! ఎన్నికలలోపు ఎలాగూ పోలవరం పూర్తయ్యే సమస్యే లేదు. సెట్టింగ్ అయితే ఒకట్రెండు నెలల్లో అయిపోతుంది. కాబట్టి చంద్రబాబు దీని వైపే మొగ్గు చూపుతాడేమో?

మొత్తానికి రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన ఉన్నట్లుగా లేదు. అంతా సినిమా సెట్టింగ్‌లాగానే సాగిపోతోంది.



# స్వచ్ఛతా హి సేవా ర్యాలీ

నెల్లూరు పొదలకూరురోడ్డు, డైకస్‌రోడ్డులో వున్న డా॥ కిషోర్స్‌రత్నం మోడల్ స్కూల్‌లోని ప్రైమరి హైస్కూల్ విద్యార్థులు ఈ నెల 20న స్వచ్ఛతా హి ర్యాలీని నిర్వహించారు. విద్యార్థినీ విద్యార్థులు సేవ్ ఎర్త్, సేవ్ లైఫ్, వృక్షో రక్షతి రక్షితః, నీటిని సంరక్షిద్దాం, కరువును నివారిద్దాం, క్లీన్ ఎర్త్... గ్రీన్ ఎర్త్ అనే నినాదాలతో ప్లకార్డులను చేతపట్టుకుని ర్యాలీగా వీధి వీధినా తిరుగుతూ ఎంతో ఉత్సాహంగా అందరికి అవగాహన కల్పించారు. ప్రభుత్వ నియమనిబంధనను అనుసరించి పరిసరాలను, తరగతి గదులను శుభ్రం చేసుకోవడం ద్వారా స్వచ్ఛత విలువను ప్రతి విద్యార్థి తెలుసుకునేలా పాఠశాల డైరెక్టర్స్ డాక్టర్ కృష్ణకిషోర్, వాసంతి కిషోర్ హ్యాండ్ వాషింగ్ ప్రోగ్రాం ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమంలో రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, సీనియర్ మేనేజర్ రాజేష్, పాఠశాల ప్రిన్సిపల్స్ బి.రామచంద్రయ్య, విజయ, మేనేజర్ విజయచంద్ర, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

# టార్గెట్ 10

(5వ పేజీ తరువాయి)

మేకపాటి 13వేల ఓట్లతో గెలిచాడు. టీడీపీ అభ్యర్థి ఆదాలకు భారీ క్రాస్ ఓటింగ్ జరిగింది. ఇంత క్రాస్ ఓటింగ్ వెనుక బలమైన కారణాలు రెండే... ఒకటి సిటింగ్ ఎంపీగా మేకపాటి మీద వున్న వ్యతిరేకత... ఆదాల మీద అన్ని వర్గాల వారికీ వున్న సానుకూలత. నెల్లూరు లోక్‌సభ పరిధిలోని నెల్లూరుసిటీ, రూరల్, కోవూరు, కావలి, ఆత్మకూరులో సగం ప్రాంతాల్లో పంటరెడ్ల ప్రాబల్యం ఎక్కువ. ఉదయగిరి, కందుకూరులలో అన్ని రకాల రెడ్లున్నారు. గత ఎన్నికల్లో ఆదాలకు క్రాస్ ఓటింగ్ పెరగడానికి ఈ అంశం కూడా ఒక కారణమే!

ఈసారి నెల్లూరు లోక్‌సభ అభ్యర్థిగా మేకపాటికి బదులు కొత్తవారిని రంగంలోకి దించడం బెటర్. మేకపాటిని నర్సారావుపేట లేదా ఒంగోలులో పెట్టుకోవచ్చు. నెల్లూరు లోక్‌సభకు మాత్రం ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులురెడ్డి లేదా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిలలో ఒకరు అభ్యర్థి కావచ్చనే అభిప్రాయం వుంది. వీరిలో ఎవరు అభ్యర్థి అయినా 7అసెంబ్లీ అభ్యర్థులకు ఉత్సాహమిచ్చినట్లే! ఇక నెల్లూరు సిటీ, రూరల్, ఆత్మకూరులలో సిటింగ్ ఎమ్మెల్యేలను మార్చాల్సిన అవసరం లేదు. ఉదయగిరిలో మేకపాటి కుటుంబసభ్యులే పోటీ చేయాలి. కోవూరుకు నల్లపరెడ్డి ప్రసన్నే మంచి అభ్యర్థి. కావలి నుండి ఈసారి సిటింగ్ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పేరుతో పాటు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి పేరు కూడా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. సూళ్లూరుపేటలోనూ సిటింగ్ ఎమ్మెల్యే సంజీవయ్యే మేలు. వెంకటగిరిలో మాత్రం ఇన్‌ఛార్జ్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డితో పాటు ప్రస్తుతం బీజేపీలో వున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేరును కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. గూడూరుకు పనబాక కృష్ణయ్య అయితే బాగుంటుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. సర్వేపల్లి నుండి ప్రస్తుతానికి సిటింగ్ ఎమ్మెల్యే కాకాణే అభ్యర్థి.

ప్రజల్లో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత వుంది. వై.యస్. అభిమానం వుంది. నెల్లూరు, తిరుపతి ఎంపీ అభ్యర్థులుగా, 10అసెంబ్లీకు అభ్యర్థులుగా గట్టివాళ్లను పెడితే చాలు... జిల్లాను క్లీన్ స్వీప్ చేయొచ్చని పార్టీ వర్గాలు విశ్వసిస్తున్నాయి.

# శెభాష్ ఆర్.కె!

(మొదటి పేజీ తరువాయి)

కేవలం 22.44 కోట్లకే ఈ భూములను వేలంలో పాడుకున్నారు. ప్రభుత్వ కనుసన్నల్లో జరిగిన వేలం పాటలో పోటీదారుల నుండి పోటీ లేకుండా చేసి రామానుజయకు మరియు ఇంకొందరికి ఈ భూములు కట్టబెట్టారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ భూ కుంభకోణంపై మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ళ రామకృష్ణారెడ్డి పోరాటం మొదలుపెట్టాడు. సదావర్తి సత్రం భూములు అంతకంటే ఎక్కువకు పోవని, వేలంపాటలో వచ్చిన ధర మీద ఎవరైనా 5కోట్లు అదనంగా చెల్లిస్తే వారికే ఆ భూములిచ్చేస్తామని స్వయంగా ముఖ్యమంత్రే ప్రకటించాడు. ఈ సవాల్‌కు ఆర్కే సై అన్నాడు. తాను అదనంగా 5కోట్లు చెల్లించేందుకు సిద్ధమేనంటూ హైకోర్టులో పిటిషన్ వేశాడు. హైకోర్టు అతనికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. వేలంపాట మొత్తానికి అదనంగా 5కోట్లు చెల్లించి భూములు స్వాధీనం చేసుకోమని చెప్పింది. హైకోర్టు ఇచ్చిన గడువు ప్రకారం ఆర్కే తనకు పరిచయం వున్న వ్యాపారవేత్తల ద్వారా డబ్బు మొత్తం కట్టించాడు. మొదటి వేలంపాట దారులు దీనిపై కోర్టుకెక్కారు. దీంతో సదావర్తి భూములకు తిరిగి వేలంపాట నిర్వహించాలని హైకోర్టు ఆదేశించడం, సుప్రీంకోర్టు దీనిని సమర్థించడంతో 18వ తేదీ చెన్నైలో వేలంపాట నిర్వహించారు. సదావర్తి భూములకు ఈ వేలం ద్వారా గతంలోకన్నా దాదాపు 38కోట్లు అదనపు రాబడి వచ్చింది. ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించి జాతీయ స్థాయిలో బిడ్లను ఆహ్వానించి వుండుంటే వేలంపాట మొత్తం ఇంకా పెరిగి వుండేదేమో! బిడ్డర్ శ్రీనివాసులురెడ్డి మళ్ళీ ఏదో రాజకీయ ఒత్తిడితో భూములు తీసుకోవడానికి వెనక్కి తగ్గాడు. అయితే అది వేరే విషయం!

ఏదేమైనా తాను చేసిన న్యాయ పోరాటం ద్వారా సదావర్తి భూముల విలువను కొంతవరకన్నా పెంచగలిగాడు ఆర్కే. అలాగే కృష్ణానది కరకట్ట లోపల అక్రమ కట్టడాలపై కూడా ఆయన చేసిన పోరాటం ఫలించింది. గుంటూరుజిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామ పరిధిలో కృష్ణానది కరకట్ట లోపల సీఎం చంద్రబాబు అధికార నివాసంతో పాటు ఎన్నో అక్రమ నిర్మాణాలున్నాయి. ఆర్కే వీటిపై పిటిషన్ వేశాడు. హైకోర్టు దీనిపై సీరియస్‌గా స్పందించింది. అక్రమ నిర్మాణాలను ఎందుకు కూల్చడం లేదంటూ ప్రభుత్వాన్ని నిలదీసింది.

అమరావతి రాజధాని పరిధిలో ప్రతిపక్ష వైకాపాకు వున్న ఒకే ఒక ఎమ్మెల్యే ఆర్.కె. రాజధాని భూముల విషయంలోనూ, సదావర్తి భూముల వ్యవహారంలోనూ, ఇప్పుడు కృష్ణానది కరకట్ట అక్రమ నిర్మాణాల విషయంలోనూ ఆయన చంద్రబాబుకు కొరకరాని కొయ్యగా మారాడు. ప్రతిపక్ష వైకాపాకు మంచి ఆయుధంగా తయారయ్యాడు.

రోత మాటలు, విపరీత చేష్టలతో వెగటు పుట్టించే రోజా వంటి వారికంటే న్యాయపోరాటాలు, ప్రజా పోరాటాల ద్వారా సత్తా చాటే ఆర్‌కె లాంటి వాళ్ళే వైకాపాకు ప్రధాన బలం కాగలరు.

# కరివేపాకులా... పవర్‌స్టార్?

(మొదటి పేజీ తరువాయి)

పోరాటమంటూ పలుచోట్ల సభలు నిర్వహించి బీజేపీ నాయకులపై విమర్శలకు కూడా దిగాడు. అయితే ఇంతకాలం పవనే బీజేపీ మీద విమర్శలు చేస్తూ వచ్చాడు. తాజా పరిణామాలు చూస్తే బీజేపీ కూడా పవన్‌ను వదులుకున్నట్లుగానే కనిపిస్తోంది. ఢిల్లీలో జరిగిన 'స్వచ్ఛతే సేవ' ర్యాలీకి ప్రధాని నరేంద్రమోడీ నుండి టాలీవుడ్ స్టార్స్ మహేష్, ప్రభాస్‌లకు ఆహ్వానం అందింది గాని, 2014 ఎన్నికల్లో మోడీకి పనిచేసిన పవన్‌ను మాత్రం మర్యాదపూర్వకంగా కూడా ఆహ్వానించలేదు. మన రాష్ట్రం నుండి ఏ స్టార్‌నూ పిలవకుండా వుంటే ఏ సమస్యా వుండేది కాదు. కాని నేడు తెలుగు ఇండస్ట్రీలో టాప్‌లో వున్న పవన్‌ను వదిలేసి మహేష్, ప్రభాస్‌లకు మోడీ ప్రాధాన్యతనివ్వడాన్నే పవర్‌స్టార్ అభిమానులు జీర్ణించుకోలేకపోతున్నారు.

# వేట ముగిసిందా?

(5వ పేజీ తరువాయి)

ఇంకా బాకీలు చెల్లించాలంటూ శరత్‌చంద్ర, సుభాష్‌లు ఇంటిచుట్టూ తిరిగి వేధించారు. దీంతో మానసికంగా నలిగిపోయిన మల్లిఖార్జునరావు కుటుంబసభ్యులతో కలిసి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన అందరినీ కలచివేసింది. పోలీసు శాఖను కదిలించింది. ఎస్పీ రామకృష్ణ దీనిపై సీరియస్‌గా స్పందించారు. ఇద్దరు డిఎస్పీలు, ఇద్దరు సిఐల మీద వేటు వేసారు. దాదాపు 300మంది బుకీలు, పంటర్లను అరెస్ట్ చేశారు. ప్రధాన బుకీలు 40మందిపై నాన్‌బెయిలబుల్ కేసులు పెట్టారు. ఈ కేసుతో సంబంధాలున్నాయనే అనుమానంతో ఇద్దరు ఎమ్మెల్యేలు పి.అనిల్‌కుమార్‌యాదవ్, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలను కూడా విచారించారు.

దాదాపు నిందితులంతా దొరికినట్లే! ఈ కేసులో అసలు దోషులను తేల్చి చట్టపరంగా శిక్షించి, జిల్లాలో బెట్టింగ్ భూతాన్ని తరిమికొడితే భవిష్యత్‌లో చాలామందిని ఆత్మహత్యల నుండి, ఆస్తులు కోల్పోయే స్థితి నుండి కాపాడినవాళ్లవుతారు.



# పనికే అధిపతి... ఈ ఉపరాష్ట్రపతి

**ఉపరాష్ట్రపతి అంటే రబ్బర్‌స్టాంప్... ఆయనకు ఏమీ పని వుండదు... గుళ్ళకు గోపురాలకు తిరగడం తప్ప! ఉపరాష్ట్రపతిని చేసి ఆయన నోరు కట్టేసారు... ఆ పదవిలో కూర్చోబెట్టి ఆయన కాళ్లను కుర్చీకి కట్టేసారు... ఇంతకాలం దేశంలో ఉపరాష్ట్రపతి పదవిలో వున్న వారిపై ప్రజల్లో వున్న అభిప్రాయమిది. మన నెల్లూరీయుడు ముప్పవరపు వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యాక కూడా అందరూ ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.**

కాని అందరూ వేరు... వెంకయ్యనాయుడు వేరు. పదవి అన్నది గుళ్ళు, గోపురాలకు తిరగడానికి, చేతులు కట్టేసుకుని ఇంట్లో కూర్చోవడానికి కాదు. ఉపరాష్ట్ర పతి... దేశంలోనే రాజ్యాంగపరమైన రెండో అత్యున్నత పదవి. ఈ పదవి ద్వారా దేశానికి ఎంతో సేవ చేయొచ్చు. దేశ ప్రజలకు ఎన్నో చేయొచ్చు. ఉపరాష్ట్రపతి అంటే రబ్బర్‌స్టాంప్ కాదని, ఉపరాష్ట్రపతి అంటే పనికే పని నేర్పించగల ఒక అత్యున్నతమైన బాధ్యత అని ఒక్క నెల కాలంలోనే మన వెంకయ్యనాయుడు నిరూపిం చారు. ఒక్క నెలరోజుల్లోనే ఆయన పాల్గొన్న కార్యక్ర మాలు, చేసిన పర్యటనలు చూస్తుంటే ఉప రాష్ట్రపతి పదవికి ఇంత శక్తి వుందా అనిపిస్తుంది.









ఆగస్టు 11వ తేదీన వెంకయ్యనాయుడు ఉప రాష్ట్రపతిగా ప్రమాణస్వీకారం చేశారు. అదే నెల 21వ తేదీన హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పౌరసన్మానం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆగస్టు 26వ తేదీన గన్నవరం ఎయిర్ పోర్టులో దిగారు. ఎయిర్‌పోర్టు నుండి అమరావతిలోనే ఆయనకు లక్షలమంది విద్యార్థులతో స్వాగతం పలికారు. అమరావతిలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన గౌరవ సత్కారం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రధానమంత్రి అవాస్‌యోజన క్రింద రాష్ట్రంలో చేపట్టనున్న 2.25లక్షల ఇళ్ల నిర్మాణానికి ఆయన శిలాఫలకం ప్రారంభించారు. అలాగే విజయవాడలో జరిగిన ఆలపాటి వెంకటరామయ్య శతజయంతి ఉత్సవాలలో పాల్గొన్నారు. 27వ తేదీ చెన్నైలో స్వర్ణ భారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. అలాగే విద్యార్థులతో సమావేశమై వృత్తి నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసంపై తన సందేశమిచ్చారు. అదేరోజు అన్నా యూనివర్శిటీలో కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ క్విట్ ఇండియా ఉద్యమానికి 75ఏళ్ళు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పాల్గొని ప్రసంగించారు.

సెప్టెంబర్ 3వ తేదీ హైదరాబాద్‌లోని నల్సర్ యూనివర్శిటీలో జరిగిన 78వ అంతర్జాతీయ న్యాయ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అలాగే 5వ తేదీ హైదరాబాద్‌లోని డా॥ ఎంసిఆర్ హెచ్‌ఆర్‌డి ఇన్‌స్టిట్యూట్‌లో ఏఐఎస్ మరియు సిసిఎస్ ఆఫీసర్స్ కొరకు నిర్వహించిన 92వ ఫౌండేషన్ కోర్సును ఆయన ప్రారంభించారు. సెప్టెంబర్ 8, 9తేదీలలో జార్ఖండ్‌లో పర్యటించారు. జార్ఖండ్ ప్రభుత్వం రాంచిలోని ప్రభాత్ తార స్టేడియంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలాగే రాంచి స్మార్ట్ సిటీ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఏ పదవిలో వున్నా వెంకయ్య వెంకయ్యే! ఆయన నోరు కట్టేయాలన్నా, పని చేయకుండా చేతులను కట్టేయాలన్నా కష్టమే! ఒక నెలలో ఒక ఉపరాష్ట్రపతి ఇన్ని కార్యక్రమాల్లో పాల్గొనడం చరిత్రలో లేదు, భవిష్యత్‌లో వెంకయ్యనాయుడిదే ఒక చరిత్ర కావచ్చు.

# మన ఎమ్మెల్యే.. మన ఇంటికి



- **విజయదశమి పర్వదినాన వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్న కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి**
- **ఇంటిని వదిలి 105 రోజుల పాటు తన నియోజకవర్గ ప్రజల మధ్యే గడపనున్న ప్రజానేత**

*ప్రజానాయకుడు కావాలంటే వందేళ్ళ రాజకీయ చరిత్ర ఉండాలా? తాతలు, తండ్రులు మంత్రులు, ఎంపీలై వుండాలా? వందలకోట్ల ఆస్తులేమన్నా ఉండాలా? ఈ ప్రశ్నలకు 'అవును' అనే సమాధానం ఉంటుంది. ఈ 'అవును' అనే సమాధానికి ఉదాహరణగా తాతలు, తండ్రుల వారసత్వంతో మన కళ్ళ ముందే రాజకీయాల్లోకి వచ్చిన నాయకులు ఎంతోమంది ఉన్నారు. ప్రజానాయకుడు కావాలంటే ఇవన్నీ అవసరం లేదు అనే జవాబుకు మాత్రం నెల్లూరుజిల్లాలో నిలువెత్తు నిదర్శనం గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి.*

సామాన్య కుటుంబం నుండి వచ్చిన ఓ వ్యక్తి రాజకీయ నాయకుడే కాదు ప్రజలు మెచ్చిన నాయకుడు కూడా కాగలడని నిరూపించుకున్న ఎమ్మెల్యే అతను. మూడున్నరేళ్ల కాలంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉంటూ కూడా ప్రభుత్వం నుండి ఎటువంటి నిధులు రాకున్నా అటు ప్రభుత్వంతో పోరాడుతూ, ఇటు అధికారుల చుట్టూ తిరుగుతూ తన నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కరిస్తూ నిద్ర లేచింది మొదలు వారితోనే వుంటున్నాడు. తెల్లారింది మొదలు ఆయన సమస్యలను వెదుక్కుంటాడు, వాటి పరిష్కారానికి పంతం పడతాడు. సమస్యలతో బాధపడే ప్రజలను తన కార్యాలయానికి తిప్పించుకోవడం కాదు, సమస్యల్లో వున్న ప్రజల చెంతకు తానే వెళ్లాలన్నది ఆయన విధానం. ఓట్లడిగినప్పుడు ఏ గుమ్మం అయితే ఎక్కాడో, ఎమ్మెల్యే అయ్యాక కూడా అదే గుమ్మం ఎక్కాలని తనను ఓటేసి దీవించిన ప్రజల కష్ట సుఖాలు తెలుసుకోవాలని ఆయన తపన. ఈ ఆలోచనతోనే 'మన ఎమ్మెల్యే.. మన ఇంటికి' పేరుతో ప్రజల మనసులకు మరింత చేరువయ్యే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నారు.

ఈ నెల 30వ తేదీన విజయదశమి పర్వదినాన నెల్లూరు రూరల్ మండలంలోని కోడూరుపాడు గ్రామం నుండి ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. నెల్లూరురూరల్ గ్రామాలతో పాటు రూరల్ పరిధిలోని నెల్లూరు కార్పొరేషన్ డివిజన్లలో కూడా 105రోజుల పాటు ఆయన పర్యటిస్తారు. నియోజకవర్గ పరిధిలోని ప్రతి ఇంటికి వెళతారు. ప్రతి ఒక్కరిని పలుకరిస్తారు. ప్రతిఒక్కరి సమస్యలు వింటారు. ఈ మూడున్నరేళ్లకాలంలో ప్రతిపక్ష ఎమ్మెల్యేగా తాను చేసిన పనులు వివరిస్తారు. ప్రభుత్వ వైఫల్యాలపై చర్చిస్తారు. అన్నపానీయాలు అన్నీ ప్రజల మధ్యే! ప్రజలు, కార్యకర్తల ఇళ్లలోనే బస చేస్తారు. ఒకరోజు రాత్రి ఏ ఇంటి వద్దయితే 'మన ఎమ్మెల్యే.. మన ఇంటికి' కార్యక్రమం పూర్తవుతుందో, పక్కరోజు అదే ఇంటి వద్దనుండి కార్యక్రమం మొదలు పెడతారు. ప్రజలతో పాటు గ్రామాలు, డివిజన్‌లలో వున్న వైసిపి బూత్ కమిటి సభ్యుల ఇళ్లకు కూడా వెళతారు. వారితో స్థానిక పరిస్థితులు, సమస్యలపై పది నిముషాలు చర్చిస్తారు. నియోజకవర్గ పరిధిలో జరిగే వివాహాలు, కర్మంత్రాలు వంటి కార్యక్రమాలకు మధ్యమధ్యలో హాజరైనా అసలు కార్యక్రమానికి బ్రేక్ వుండదు. ముఖ్యంగా కార్యక్రమాన్ని బాణాసంచా, డప్పులు, పూలదండలు, భారీ జనం వంటి ఆర్భాటాలకు దూరంగా కేవలం ఒక బిడ్డ తన తల్లిదండ్రుల ఇంటికి వస్తున్నంత ఆనందకర వాతావరణం ఉట్టిపడే రీతిలో నిర్వహించాలని కోటంరెడ్డి నిర్ణయించడం విశేషం. ఎమ్మెల్యే కాకముందే 2014 ఎన్నికలకు ముందే ప్రజాదీవెన పేరుతో 141రోజుల పాటు నెల్లూరు నియోజకవర్గంలో గడపగడప తొక్కిన రికార్డు ఆయనకుంది. ఈ రోజు వైసిపి చేపట్టిన గడపగడపకు వైకాపా, తెలుగుదేశం వాళ్ళ ఇంటింటికి టీడీపీ, బీజేపీ వాళ్ళ గుండె గుండెకు బీజేపీ వంటి కార్యక్రమాలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎప్పుడో ఆచరించి చూపినదే! ఆయన కాన్సెప్ట్‌లనే వీళ్ళు అనుసరిస్తున్నారు. 'మన ఎమ్మెల్యే.. మన ఇంటికి' కార్యక్రమం తర్వాత 2018 ఫిబ్రవరిలో మళ్ళీ రెండో విడత కార్యక్రమాన్ని 366రోజుల పాటు ఏకధాటిగా నిర్వహించాలని కూడా ఆయన నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఈ లెక్కన చూస్తే 2019 ఎన్నికల దాకా కూడా ఆయన తన సొంత ఇంటికి వెళ్ళే పరిస్థితి వుండదు. కాని, నియోజకవర్గంలో అందరికీ సొంత మనిషే కాబట్టి ఇంటికి వెళ్ళాలన్న బెంగే ఉండదు.









Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com